DATE: 17-08-2022 RNI NO : TELTEL/2021/81092

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 119

పేజీలు - 08
వెల: రూ 5/-

prajamantalu.com

బుధవారం 17 ఆగస్టు, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



బీహార్‌లో నితీశ్ కేబినేట్ విస్తరణ
31 మంది మంత్రులతో ప్రమాణం చేయించిన గవర్నర్ 5లో



కాశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
నదిలో బస్సుపడి ఏడుగురు జవాన్ల మృతి 5లో



## తెలంగాణలో అద్భుత ఘట్టం
# ఆవిష్కరణ

**సామూహిక జాతీయ గీతాలాపనతో పులకరించిన నేల**

- జనగణమనతో ఊరూవాడా, పల్లె, పట్టణం మమేకం
- ఆబిడ్స్‌లో జాతీయ గీతాలాపనచేసిన సీఎం కేసీఆర్
- ఎక్కడిక్కడే నిలిచి చెయ్యెత్తి జైకొట్టిన జనం



హైదరాబాద్,ఆగస్ట్16: తెలంగాణలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్య వజ్రోత్స వాల్లో భాగంగా సామూహిక జాతీయ గీతాలాపన ఉద్వేగభరితంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సామూహిక జాతీయ గీతాలాపన ప్రశాంతంగానే కాదు.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం మార్మోగింది. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ అంతటా భారత జాతీయ గీతం 'జనగణమన' ఆలాపనతో ఊరూ, వాడా..ప్లలె, పట్నం దద్దరిల్లింది. సరిగ్గా 11.30 గంటలకు రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలు అంగన్‌వాడీ తదితర సెంటర్లో సామూహికంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. కాగా, హైదరాబాద్‌లోని అబిడ్స్ జీపీఎస్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరై జనగణమన ఆలపించారు. సీఎం వెంట మంత్రులు, తదితరులు ఉన్నారు.మంగళవారం ఉదయం 11గం.30ని. ప్రాంతంలో రాష్ట్రవ్యాప్తంగా అందరూ జనగణమన ఆలపించాలని మిగతా 2లో..

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం
# మోకాలడ్డు

**ఉద్యమంలో లేనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు**

ఎన్నికలు వస్తే రకరకాల వాళ్లు వస్తుంటారు

గుంటనక్కల్లా వచ్చి పీక్కతినకుండా జాగ్రత్త పడాలి

పెన్షన్లు, రైతుబంధు, ఉచిత విద్యుత్, ఇంటింటికి నీరు మన ఘనతే



- తెలంగాణ ఏర్పాటు వల్లనే వికారాబాద్‌కు జిల్లా
- ఇక్కడి అనంతగిరి కొండలకు ప్రత్యేకత ఉంది
- తెలంగాణ భూముల ధరలకు రెక్కలొచ్చాయి
- కలెక్టరేట్ ప్రారంభసభలో సీఎం కేసీఆర్ వెల్లడి
- నూతన కలెక్టరేట్ ప్రారంభించిన సీఎం కేసీఆర్

వికారాబాద్,అగస్టు16: తాను కలలు కన్న బంగారు తెలంగాణ త్వరలోనే వస్తుందని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 57ఎండ్ల నిండిన 10 లక్షల మందికి నిన్నటి నుంచి పెన్షన్లు ఇస్తున్నామ న్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాష్ట్రం ఏర్పడకపోతే ఇవాళ వికారాబాద్ జిల్లా అయ్యేదా అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో నవ్విన వాళ్లు ఇవాళ ఏదేదో మాట్లాడుతున్నారని చెప్పారు. ఉద్యమం లో లేనోళ్లు అడ్డుపొడుగు మాట్లాడుతున్నారని, మాట్లాడేవాళ్లు మాట్లాడుతూనే ఉంటారని, ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎన్నికలు వస్తే రకరకాల వాళ్లు వస్తుంటారని, ప్రజలు అన్నీ విని ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులతో ఇప్పుడున్న పరిస్థితులను బేరీజ్ వేసుకోవాలని కోరారు. తెలంగాణను గుంటనక్కలు వచ్చి పీక్కతినకుండా మిగతా 2లో..

## ప్రమాణ స్వీకారం చేసిన
# న్యాయమూర్తులు



ఆరుగురు న్యాయమూర్తుల్లో ముగ్గురు కరీంనగర్ వాసులు

ఉమ్మడి జిల్లా నుంచి వేణుగోపాల్, పుల్లాకర్తీక్, శ్రీనివాసరావు

హైదరాబాద్,అగస్టు16: తెలంగాణ హైకోర్టుకు ఇటీవల నియమితులైన న్యాయమూర్తులు ఆరుగురు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వీరందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో మిగతా 2లో..



## వేయికిలోమీటర్లు పూర్తి చేసుకున్న
# బండి యాత్ర

కేసీఆర్ పునాదులు కదులుతున్నాయన్న సంజయ్

ఓర్వలేకనే దాడులు తెగబడ్డారని మండిపడ్డ బండి

కేసీఆర్ పాలన తీరుపై మండిపడ్డ తరుణ్ చుగ్

జనగామ,అగస్టు16: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం పాలకుర్తి మండలం, విస్నూర్ నుంచి ప్రజాసంగ్రామ యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకట స్వామి, మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ, స్థానిక నేతలు పాల్గొన్నారు. విస్నూర్, లక్ష్మీనారాయణపురం, పాలకుర్తి, కడవెండి వరకూ పాదయాత్ర సాగనుంది. మంగళవారంతో బండి సంజయ్ వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్నారు. దేవరుప్పుల దాడి ఘటనల నేపథ్యంలో పాదయాత్ర రూట్‌లో పోలీసులు భారీగా మోహరించారు. ప్రజా సంగ్రామ యాత్రతో కేసీఆర్ పునాదులు కదులుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. పాదయాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తమపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల రాజ్యాంగాన్ని బొంద పెట్టేందుకే ప్రజాసంగ్రామ యాత్ర చేపట్టినట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. పాలకుర్తి చౌరస్తాలో రోడ్ షో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నిజాం పాలన సాగుతోందని ఆరోపించారు. తాను వస్తున్నాననే పోలీసులు షాపులు బంద్ చేయించారని విమర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ తీరును తీవ్రంగా తప్పుబట్టిన ఆయన.. తమ లిస్ట్ లో వరంగల్ సీపీ పేరు రాసుకున్నామని మిగతా 2లో..

## 2047 సరే.. 2022 వాగ్దానలా
# సంగతేంటి !

**ట్విట్టర్ వేదికగా ప్రధాని మోడీకి కేటీఆర్ ప్రశ్నలు**



హైదరాబాద్,ఆగస్ట్16: గతంలో ప్రధాని మోదీ చేసిన వాగ్దానాలను గుర్తు చేస్తూ మంత్రి కేటీఆర్ నిలదీశారు. 2022 ఆగస్టు 15 నాటికి భారత్ ఎన్నో ఘనతలు సాధిస్తుందని గతంలో చేసిన ప్రసంగాలను మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. సోమవారం ఎర్రకోట వేదికగా 2047 కోసం ప్రధాని మోదీ తన ప్రసంగంలో కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. రానున్న 25 ఏళ్లలో ఆ టార్గెట్లను అందుకోవాలన్నారు.

అయితే ప్రధాని మోదీ విధించిన ఆ లక్ష్యాలు గొప్పగానే ఉన్నాయని, కానీ 2022 ఆగస్టు 15 నాటికి మిగతా 2లో..

## ప్రజానాడి




## కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు
# రెండు ఒక్కటే

- ఎన్నికల్లో కలసి పోవడం ఖాయం
- బీజేపీలో చేరిన చౌటుప్పల్ ఎంపీపీ
- కేసీఆర్ వైఖరితోనే పార్టీని వీడుతున్నారన్న ఈటల



యాదాద్రి భువనగిరి,అగస్టు16:కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ముందుగానీ తరువాత గానీ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని మిగతా 5లో..

## నేడు లాసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,అగస్టు16: మూడేండ్లు, ఐదేండ్ల లా కోర్సులతోపాటు, ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన లా, పీజీలాసెట్ ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి మధ్యాహ్నం 3:30 గంటలకు విడుదల చేయ నున్నారు. జూలై 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు 82.46 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

# తెలంగాణలో అద్భుత ఘట్టం
# ఆవిష్కరణ

మొదటిపేజీ తరువాయి..

టీఆర్ఎస్ ప్రభుత్వం కోరిన వెంటనే అందుకు తగ్గట్లుగా ప్రజలంతా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ అబిడ్స్‌లో నిర్వహించిన సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అబిడ్స్ జీపీవో నెహ్రూ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు భారీ స్పందన లభించింది. ఒక్క నిమిషం మెట్రోసర్వీసులు ఆగిపోగా.. ఎక్కడికక్కడే ప్రయాణికులు జాతీయ గీతం ఆలపించారు. సికింద్రాబాద్ ప్యాట్నీ కూడలి వద్ద జనగణమన జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నగర పౌరులు స్వాతంత్య వజ్రోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక జాతీయ గీతాలాపన ఉద్వేగభరితంగా జరిగింది. ప్రజలంతా ఒకేచోట ఏకమై జనగణమన గీతాన్ని ఆలపించారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోంటే.. ఒకే గొంతుకలో వినిపించిన జాతీయ గీతంతో తెలంగాణం మురిసిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రజలంతా ఒకేచోట ఏకమై.. ఒకే గొంతుకలో జనగణమన గీతాన్ని ఆలపించారు. ఆ ఒక్కక్షణం రాష్ట్రమంతా ఉద్వేగానికి లోనైంది. ప్రతి ఒక్కరి కళ్లు 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని గుర్తు చేసుకుంటూ చెమ్మగిల్లాయి. భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల పోరాటాన్ని స్మరిస్తూ ప్రజలంతా జాతీయ గీతాన్ని పాడారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు హైదరాబాద్ అబిడ్స్ జీపీవో కూడలి వద్ద జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. అబిడ్స్ సర్కిల్‌కు చేరుకున్న కేసీఆర్.. నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీలు కేశవరావు, అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో భాగంగా.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లు త్రివర్ణాలతో కళకళలాడాయి. అబిడ్స్ జీపీవో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన స్వాతంత్య సమరయోధుల చిత్ర పటాలు, రంగుల బ్యానర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం కోసం ట్రాఫిక్ పోలీసులు అన్ని కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్ వచ్చేలా ఏర్పాటు చేశారు. జాతీయ గీతాలాపన ముగిసే వరకు వాహనాలన్ని కూడళ్ల వద్ద నిలిపివేశారు.

వాహనదారులతో పాటు ట్రాఫిక్ పోలీసులూ జాతీయగీతాన్ని ఆలపించారు. సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నియమాలను చెప్పేందుకు ఏర్పాటు చేసిన మైకుల్లోనూ జాతీయ గీతం వినిపించారు. హైదరాబాద్ ట్రాఫిక్ సంయుక్త సీపీ రంగనాథ్ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా ప్రశాంతంగా ఈ కార్యక్రమం జరిగింది. సామూహిక జాతీయ గీతాలాపన ముగిసిన తర్వాత వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిగ్నళ్లను నిర్వహించారు. సిగ్నల్స్ వద్ద నిమిషం పాటు రెడ్ సిగ్నల్ ఇచ్చి అంతా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాటు చేశారు అధికారులు. మరోవైపు మిగతా జిల్లాల్లోనూ టీఆర్ఎస్ నేతలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రయత్నించారు. విద్యార్థులు సైతం భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే చాలాచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు మాత్రం ఎదుర్కొన్నారు వాహనదారులు. స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై నిర్వహించిన సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.అంతకుముందు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకల్లో విద్యార్థులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. శాంతి కపోతాన్ని, త్రివర్ణపు బెలున్లను గాల్లోకి ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు జాతీయ జెండాలు చేతబట్టుకుని.. నిర్వహించిన భారీ ర్యాలీలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున స్వాతంత్య భారత



వజ్రోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఈ రోజు చారిత్రాత్మక సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కె. విజయలక్ష్మిరెడ్డి, కలెక్టర్ ముశ్రరఫ్ పారూఖీ అలీ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలు ఓ అద్భుత ఘట్టమని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వజ్రోత్సవాల నేపథ్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో సామూహిక జాతీయ గీతాలాపన సందర్భంగా మంత్రి స్వయంగా తయారు చేయించిన 3 వేల అడుగుల పొడవైన జాతీయజెండాను ప్రదర్శించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ జెండాను ప్రదర్శించారు. జాతీయ గీతాలాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రికార్డు స్థాయిలో మూడు కిలోమీటర్లు పొడవు జాతీయ జెండా ప్రదర్శించడం ఓ అద్భుత ఘట్టం అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన పోరాటయోధుల్ని స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకే సీఎం కేసీఆర్ 2 వారాల పాటు భారత స్వాతంత్య్ర వజ్రోత్సవ సంబురాలకు రూపకల్పన చేశారన్నారు. వికారబాద్ జిల్లాలో సామూహిక జనగణమన ఘనంగా నిర్వహించారు. ఎంపి, ఎమ్మెల్యేలు, ప్రజలు ఎక్కడిక్కడే జనగణమన పాడారు. ఎంపి రంజిత్‌రెడ్డి ఇతర ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు వజ్రోత్సవాలు నిర్వహిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో సామూహిక గీతాలాపన కార్యక్రమంలో పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఉచితంగా జాతీయ జెండాలను అందజేసి జాతీయ ఐక్యతను సీఎం కేసీఆర్ చాటారని మంత్రి తెలిపారు.ఈ నెల 22 వరకు నిర్వహించే వజ్రోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి తెలపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని వివరించారు.

కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, ఐజీ కమలహాసన్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, లైబ్రరీ చైర్మన్ మురళీ కృష్ణ, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఎస్పీ కోటి రెడ్డి, డీఈవో రేణుక, పాల్గొన్నారు. భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి ఇండియా సూపర్ పవర్‌గా ఎదగాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.

సామూహిక గీతాలాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని గీతా భవన్ వద్ద నిర్వహించిన జాతీయ గీతాలాపన కార్యక్రమంలో విద్యార్థులు, నగరవాసులతో కలిసి వారు సామూహికంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా 15 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారన్నారు. నేటి తరానికి స్వాతంత్ర్య ఉద్యమం గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గాంధీజీ చరిత్రను నేటితరానికి తెలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో గాంధీ సినిమాను ప్రదర్శిస్తున్నామని వారు తెలిపారు. సూపర్ పవర్ అంటే అమెరికా, రష్యా దేశాలు అని, అణ్వస్త్రాలు, జెట్ విమానాలు, బాంబర్స్ ఉంటేనే సూపర్ పవర్ దేశాలు అని మేము చదువుకున్నాం. అయితే రాబోయే 25 సంవత్సరాల వరకు భారతదేశం సూపర్ సాఫ్ట్ పవర్ కావాలని, సూపర్ సాఫ్ట్ పవర్ అంటే విద్య, విజ్ఞానం, వ్యవసాయం, ఇండస్ట్రీస్ అన్నారు. భారత దేశాన్ని సూపర్ సాఫ్ట్ పవర్ గా తీర్చి దిద్దుకునేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలన్నారు. 8 సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించి యావత్ దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ,సుడా చైర్మన్ జీవి రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం
# మోకాలడ్డు

మొదటిపేజీ తరువాయి..

ప్రజలు జాగ్రత్తపడాలన్న సీఎం... మోసపోతే గోసపడే పరిస్థితులు వస్తాయని చెప్పారు. 58 ఏళ్లు సమైక్య పాలనలో గోస పడ్డామని స్పష్టం చేశారు. ఎనిమిదేళ్లు అధికారంలో ఉండి మోడీ ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలని నిలదీశారు. మేలు చేయకపోగా రైతు బంధు వంటి పథకాలు ఉచిత పథకాలని, వాటిని రద్దు చేయాలని కోరుతున్నారని తెలిపారు. బీజేపీ నాయకుల మాటలు నమ్మితే మోటర్లకు మీటర్లు వస్తాయన్నారు. మన సంపదను మొత్తం దోచి పెద్ద పెద్ద షావుకారులకు ఇస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సవాల్ విసిరారు. రైతు బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్న కేసీఆర్... రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని తెలిపారు. ఒంటరి మహిళలు, వృద్ధులకు, భర్తలు చనిపోయిన ఆడవారికి గతంలో కేవలం 200 రూపాయల పెన్షన్ దక్కేదని, ఇప్పుడు రూ.2016 టంచన్‌గా ప్రతినెలా 36 లక్షల మందికి అందిస్తున్నామని కేసీఆర్ అన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం, 57 ఏళ్లు పైబడిన వారికి కూడా పెన్షన్ ఇచ్చే నిర్ణయం తీసుకున్నాం. 10 లక్షల పెన్షన్లు మంజూరు చేశామన్నారు. దివ్యాంగులకు కూడా నెలకు సాయం అందిస్తున్నాం. ఏ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా.. ఎవరికీ లంచాలు పొందే అవకాశం లేకుండా.. నేరుగా ఖాతాలో జమ అవుతున్నాయని పేర్కొన్నారు. వికారాబాద్ ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ, దేశ వ్యాప్తంగా అనంతగిరి కొండలకు ప్రత్యేక పేరుందన్నారు. ఇక్కడి టీబి దవాఖానా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.. వికారాబాద్ జిల్లాలో నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం కేసీఆర్ ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమం జరిగే సమయంలో నేను ఎప్పుడు ఈ ప్రంతానికి వచ్చిన ప్రజలందరూ రంగారెడ్డి జిల్లా కార్యాలయాలు వికారాబాద్‌లో పెట్టాలని కోరారు. తెలంగాణ వస్తే భగవంతుని దయ వల్ల వికారాబాద్‌నే జిల్లా చేసుకుందామని చెప్పాను. చేశాను. అద్భుతమైన పరిపాలన భవనం నిర్మించుకున్నాం. ఇవాళ ఈ భవనాన్ని ప్రారంభించుకున్నందుకు సంతోషంగా ఉంది. శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాను. గతంలో ఇక్కడ టీబీ దవాఖాన ఉండేది. వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ, డిగ్రీ కాలేజీ మంజూరైంది. మీ ఊరికి పోయిన తర్వాత మీ పెదద్దలతో చర్చ పెట్టాలి. తెలంగాణ రాకుంటే వికారాబాద్ జిల్లా అయ్యేదా? మెడికల్ కాలేజీ వచ్చేదా?



రూ.3016 ఇచ్చి ఆదుకుంటున్నాం. ఆడపిల్లల పెళ్లికి కులమతాలతో సంబంధం లేకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ స్కీంలతో ఆదుకుంటున్నామని అన్నారు. ఆస్పత్రులలో ఎలా ప్రసవాలు జరుగుతున్నాయో, వారికి కేసీఆర్ కిట్‌లు ఎలా అందిస్తున్నామో అందరికీ తెలుసు. ఇవి మిగతా రాష్ట్రాల్లో ఎక్కడా లేవని సిఎం అన్నారు. పేదలను, అభాగ్యులను ఆదుకునేందుకు పెన్షన్లు ఇస్తున్నమని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాతనే కరెంటు బాధలు పోయాయి. గతంలో కరెంటు ఎప్పుడొస్తదో? ఎప్పుడు రాదో? ఎన్ని మోటార్లు కాల్తయో? ఏసిన పంట పండుతదో లేదో తెల్వదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వ్యవసాయానికి, పరిశ్రమలకు, దుకాణాలకు, ఇళ్లకు 24 గంటలూ అత్యుత్తమ విద్యుత్ అందించే రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. మంచి నీళ్ల బాధ పోయింది. కరెంటు బాధ పోయింది. సంక్షేమం చేసుకుంటున్నమన్నారు. కర్ణాటక ప్రజలు తమను తెలంగాణలో కలిపేయండి లేదా తెలంగాణలోని పథకాలను అమలు చేయాలని ఎమ్మెల్యేలను కూర్చోబెట్టి అడుగుతున్నారు. తాండూరు వెళ్తూ ఉండే వాళ్లకు ఈ విషయం బాగా తెలుసు. గతంలో రైతులు నీళ్లు, కరెంటు లేక.. హైదరాబాద్ వచ్చి కూలీలుగా, ఆటోరిక్షావాలాలుగా పనిచేసేవారు. కానీ ఈరోజు పల్లెప్రగతి కార్యక్రమాలతో రైతాంగం అంతా ధీమాగా ఎకరానికి రూ.10 వేల రూపాయల పంట పెట్టుబడి తీసుకుంటున్న ఒకే ఒక రైతు ఇండియాలో తెలంగాణ రైతు అని అన్నారు. రైతులకు ఉచిత కరెంటే కాదు, ప్రాజెక్టులు ఉన్న చోట ఉచితంగా నీరు అందిస్తున్నాం. గతంలో ఉన్న నీటి బకాయిలు కూడా రద్దు చేశాం. గతంలో ప్రమాదాల్లో రైతులు చనిపోతే ఆపద్భందు అని చెప్పి రూ.50 వేలు ఇచ్చేవాళ్లు. అది కూడా ఆరేడు నెలలపాటు ప్రభుత్వాఫీసుల చుట్టూ తిరిగితే.. ఏ పదివేలో ఇచ్చి మిగతావి మేసేవాళ్లు మేసి మిగతావి రైతులకు ఇచ్చేవారు. పల్లె సీమలు పచ్చదనంతో కళకళలాడాలి, వ్యవసాయ స్థిరీకరణ జరగాలి, ప్లలెల్లో ఉన్న వారందరికీ పనులు దొరకాలనే ఆలోచనతో ప్రభుత్వం నేడు ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగానే గుంట భూమి ఉన్న రైతు చనిపోయినా కూడా పదిరోజులు తిరగకముందే రైతుభీమా కింద రూ.5 లక్షల ఆర్థిక డిగ్రీ కాలేజీ వచ్చేదా? అనే విషయాలపై ఆలోచించాలి. తెలంగాణలో జరుగుతన్న కార్యక్రమాలు ప్రతి ఊర్లో, ప్రతి ఇంట్లో జరుగుతున్నాయన్న విషయాలు మీ అందరికీ తెలుసు. గతంలో మన వ్యసాయం ఎట్ల ఉండేది. పెన్షన్ ఎంత వచ్చేది..? బియ్యం ఎన్ని కిలోలు ఇచ్చేది? కరెంట్ ఎన్ని గంటలు వస్తుండే?.. ఇవన్నీ గమనించాలి. పలు సందర్భాల్లో అనేక రకాల చర్చలు జరుగుతాయి. వాస్తవాన్ని యావత్ ప్రజలు చర్చించాలి. దాని ప్రకారమే మన నిర్ణయాలు ఉండాలి. 58 ఏండ్లు చాలా బాధలు పడ్డది తెలంగాణ. గతంలో ఉద్యమం సఫలం కాలేదు. ఫలితం రాలేదు. పిల్లలు చనిపోయారు కానీ ఉద్యమం గెలవలేదు. సమైక్యవాదులు గెలిచారు. తెలంగాణ వస్తే రంగారెడ్డి జిల్లా భూముల ధరలు పడిపోతాయని దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు భూముల ధరలు డిమాండ్ ఉన్నాయి. ఇవాళ తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే.. వేరే రాష్ట్రాల్లో మూడు, నాలుగు ఎకరాలు కొంటున్నారని కెసిఆర్ అన్నారు. తెలంగాణ ఇప్పుడిప్పుడే తేరుకుంటుంది. సందర్భం, ఎలక్షన్లు వచ్చిప్పుడు రకరకాల వారు వస్తుంటారు. వాస్తవం మనం ఆలోచించాలి. యావత్ తెలంగాణలో ఏ విధంగా పరిస్థితులు ఉండే. మంచినీళ్ల కోసం గోసపడ్డాం. ఇవాళ మిషన్ భగరీథద్వారా పరిశుభ్రమైన నీరు అందిస్తున్నామని కేసీఆర్ తెలిపారు. వికారాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించాక కలెక్టరేట్‌లో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్వర్ రెడ్డి, కాలే యాదయ్య, పైలట్ రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నేపల్లిలో సమీకృత కలెక్టరేట్ కు ప్రభుత్వం 34 ఎకరాల భూమి కేటాయించింది. మొత్తం రూ.60.70కోట్లు వెచ్చించి కలెక్టరేట్ నిర్మాణం చేపట్టింది. మొత్తం 42 విభాగాలు ఇక్కడ నుంచి పనిచేయనున్నాయి. అంతకుముందు నూతనంగా నిర్మించిన టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ప్రజా ప్రతినిధులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### 2047 సరే.. 2022 వాగ్దానలా
# సంగతేంటి !

మొదటిపేజీ తరువాయి..

చేరుకోవాలన్న లక్ష్యాల గురించి ప్రధాని పట్టించుకోవడంలేదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ప్రధాని గతంలో చేసిన వాగ్దానాల గురించి దేశ ప్రజలు తెలుసుకోవాలని భావిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. క్యా హువా తేరా వాదా అన్న హ్యాష్‌ట్యాగ్‌తో మంత్రి కేటీఆర్ ఓ ఫోటోను అప్‌లోడ్ చేశారు. దాంట్లో మోదీ గతంలో చేసిన ప్రసంగాలను ప్రస్తావించారు. 2022 నాటికి ప్రతి పేదవాడికి ఇంటిని నిర్మించి ఇస్తామన్నారని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారని, భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ల డాలర్లుగా మారుస్తామని, ప్రతి ఇంటికీ కరెంటు సరఫరా చేస్తామని ప్రధాని మోదీ వాగ్దానం చేశారని, కానీ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. మీ లక్ష్యాలను మీరు గుర్తించలేనప్పుడు జవాబుదారీతనం ఎక్కడ ఉంటుందని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. మీ వైఫల్యాలను మీరే గుర్తించలేకపోతున్నారని విమర్శించారు.

**అమరుల స్ఫూర్తితో యువత లక్ష్యాలు సాధించాలి**

నల్లగొండ,అగస్టు16: అమరుల స్ఫూర్తితో యువత తాము ఎంచుకున్న రంగాల్లో విజయాలను సాధించాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా సందర్భంగా వజ్రోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారని ఆయన పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతిని సాధించిందని ఆయన తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మున్సిపల్ కమిషనర్ రమణ చారి, జడ్పీ ఎ÷-లోర్ లీడర్ పాశం రాం రెడ్డి పాల్గొన్నారు.

### ప్రమాణ స్వీకారం చేసిన
# న్యాయమూర్తులు

మొదటిపేజీ తరువాయి..

ముగ్గురు ఉమ్మడి కరీనంగర్ జిల్లాకు చెందిన వారు కావడం విశేషం. జస్టిస్ ఏనుగుల వెంకట వేణుగోపాల్, జస్టిస్ నగేష్ భీమపాక, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ కాజ శరత్, జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ మంకమ్మతోటలో 1967 ఆగస్టు 16న జన్మించిన జస్టిస్ ఏనుగుల వెంకట వేణుగోపాల్... 1992లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది దివంగత రామ్‌జెఠ్మలానీ వద్ద జూనియర్‌గా పనిచేశారు. రైల్వే స్టాండింగ్ కౌన్సిల్‌గానూ సేవలందించారు. ఆ తర్వాత 2021లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. జస్టిస్ నగేష్ భీమపాక స్వస్థలం భద్రాచలం. 1993లో బార్ కౌన్సిల్‌లో నమోదై...హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన.. ప్రస్తుతం వైద్య, ఆరోగ్యశాఖ ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. జస్టిస్ పుల్లా కార్తీక్ జగిత్యాల వాసి. 1996లో బార్ కౌన్సిల్‌లో నమోదయ్యాక హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించి.. 2015లో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌లో ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 2017 నుంచి హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో ఎంఎ, విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన జస్టిస్ కాజ శరత్.. 2002 నుంచి హైకోర్టులో అన్ని రకాల కేసుల్లోనూ వాదనలు వినిపిస్తున్నారు. జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావుది రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట. ఆయన 2015 నుంచి సింగరేణి కాలరీస్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగుతున్నారు. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మహబూబాబాద్ జిల్లా సూదనపల్లికి చెందిన వ్యక్తి కాగా.. 2001లో హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2019 నుంచి అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా సేవలందిస్తున్నారు. సివిల్, ఆర్థిక నేరాలు, కార్పొరేట్ లా, మోటారు ప్రమాదాలు, సర్వీసుకు చెందిన కేసుల్లో వాదనలు వినిపించారు.

## ప్రపంచానికి దారిచూపిన మహాత్ముడు
### సామూహిక జాతీయగీతాలాపనలో మంత్రి జగదీశ్

యాదాద్రి భువనగిరి,అగస్టు16: అహింసాయుత మార్గాన్ని ఆయుధంగా మలచుకుకొని.. ప్రపంచానికి సరికొత్త సిద్ధాంతాన్ని అందించిన యోధుడు గాంధీజీ అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చౌటుప్పల్‌లో సామూహిక జాతీయగీతాలాపనలో పాల్గొని మాట్లాడారు. అహింస అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు. అలాంటి మహనీయుల గొప్పతనాన్ని నేటి తరానికి తెలియ జెప్పాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం అన్నారు. అందులో భాగంగానే వజ్రోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి జగదీష్ రెడ్డి వెల్లడించారు. గాంధీజీని అగౌరపరిచేలా కొన్ని దుష్ట శక్తులు బయలు దేరాయన్నారు. వాటన్నింటికి చరమ గీతం పాడి వర్తమాననికి స్వాతంత్య సంగ్రామం, దాని విశిష్టతను నేటి తరాలకు అందించాలనే బృహత్తర ఆలోచన తోటే వజ్రోత్సవాలకు సీఎం కేసీఆర్ అంకురార్పణ చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే కిశోర్ కుమార్,శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్, బొల్లం మల్లయ్య యాదవ్, మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జ్ కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్రెడ్డి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### వేయికిలోమీటర్లు పూర్తి చేసుకున్న
# బండి యాత్ర

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఒకవేళ సర్కారు చేయని పక్షంలో మెడలు వంచి జరిపిస్తామని చెప్పారు. కేటీఆర్ డీజే టిల్లు అని, ముఖ్యమంత్రిని పాస్ పోర్టు బ్రోకర్ అని విమర్శించిన ఆయన ఖమ్మం హాస్పిటల్‌లో కేసీఆర్ మందు తాగుతూ దొంగదీక్ష చేశారని అన్నారు. ఖాసీం చంద్రశేఖర్ రజ్వీ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని బండి హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో ఓటుకు పదివేలు ఇచ్చిన టీఆర్ఎస్ పార్టీ మునుగోడులో రూ.30 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చే పైసలు తీసుకొని బీజేపీకి ఓటేసి గడీల పాలన అంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ యాత్రపై టీఆర్ఎస్ నేతల దాడిని ఆ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ తరుణ్ చుగ్ ఢిల్లీలో ఖండించారు. బెంగాల్ తరహా విధ్వంసాలకు టీఆర్ఎస్ పాల్పడుతోందన్నారు. టీఆర్ఎస్ గుండాలతో సంజయ్ యాత్రను ఆపాలని చూస్తున్నారు. ఎవరు ఎలాంటి కుట్రలు చేసినా ప్రజా సంగ్రామ యాత్ర ఆగదని స్పష్టం చేశారు. కేసీఆర్ అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. పోలీసుల తీరు కూడా సరిగ్గా లేదని అన్నారు. ముఖ్యమంత్రులు వస్తారు పోతారని... పోలీసులు న్యాయం వైపు ఉండాలని హితవుపలికారు. బీజేపీలో చేరికలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల నుంచి చాలా మంది నాయకులు బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. అమిత్ షా మునుగోడు సభపై బుధవారం స్పష్టత ఇవ్వనున్నట్లు తరుణ్ చుగ్ వెల్లడించారు.






జగిత్యాల లోని ' శాతవాహన యు.పి.యస్. వాణీ నగర్' లో సామూహిక జాతీయ గీతాలాపనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు



ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో బాగంగా మంగళవారం ఉ 11.30 గంటలకు సామూహిక జాతీయ గీతాలాపనలో రైతు ఐక్య వేదిక నాయకుడు వేముల కర్ణాకర్ రెడ్డి ధర్మపురి మండలం తీగల ధర్మారం పొలం పనుల్లో మందు పిచికారీ చేస్తూ స్ప్రే పంపుకి జాతీయ జెండా కట్టి, సెల్యూట్ చేస్తూ అన్నదాతలు అన్నం పెట్టడంలో నే కాదు, దేశానికి వెన్నుముక గా నిలుస్తూ దేశభక్తి ని చాటి చెప్పిన వైనం



కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడి బజార్లోని గాంధీ విగ్రహం వద్ద ఆజాద్ కా అమృత్ మహోత్సవం లో భాగంగా సామూహిక జాతీయ గీతాలపనలో పాల్గొన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మరియు ప్రభుత్వ కాలేజి విద్యార్థిని, విద్యార్థులు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ, అటవీశాఖ, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉద్యోగస్తులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు. గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేసిన రెడ్ స్టార్ ఫ్రెండ్స్ యూత్



"సామూహిక జాతీయ గీతాలాపన" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీష్ కుమార్. ప్రభుత్వ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు విద్యార్థి విద్యార్థినులు, పట్టణ ప్రజలు



కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజ నర్సింగరావు ఆధ్వర్యంలో సామూహిక జాతీయ గీతాలాపన... పాల్గొన్న సర్పంచ్ అంబాటి లతా తిరుమలేష్, సెక్రెటరీ శేఖర్ కారోబార్ చారి, వార్డు సభ్యులు, పారిశుధ్ధ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వివోఏలు టిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రొద్ద శరత్, కొండగట్టు డైరెక్టర్ బొడ్ల సతీష్, గాజుల నరేష్ గౌడ్, దేవయ్య పిట్టల మాధవి శ్రీనివాస్, సమిరి శెట్టి విమల సురేష్, టిఆర్ఎస్ నాయకులు గాజుల శ్రీనివాస్ గౌడ్, కిషోర్ దుర్గాప్రసాద్, దశరథం, మురళి, వాసవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు

# సేవ చేసే గుణం ప్రతి ఒక్కరు ఉండాలి

**ఎమ్మెల్యే డా. రాజయ్య**

**రఘునాథపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** మారుమూల గ్రామాల్లో పేద ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని దయగల హృదయంతో ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని మాజీ డిప్యూటీ సీఎం ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొని స్వయంగా రోగులకు పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణి చేశారు. ఈ సమావేశానికి స్థానిక సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ గౌడ్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల నిర్వాహకులు వంగ రాములు గౌడ్ పాల్గొన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సేవలు చేయడం అంటే ఎంతో కష్టంతో కూడిన పని అని ఆపదలో ఉన్న వారికి భరోసా ఇవ్వడం సంతోషకరమన్నారు. సేవ చిన్నదైన పొందేవారు ఆశించి ఆశీస్సులు మనకు జీవితాంతం తోడ్పడితే ఏమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతినీ గురువారం 18న ఖిలాషాపురం కోటలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జయంతి ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా కులమతాలకు అతీతంగా తరలివస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు, ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, ఎంపీడీవో అసిన్,ఎంపీటీసీ అలిబిలి కృష్ణ, గడ్డమీది వెంకన్న, మాజీ సర్పంచి దూడల యాదగిరి



గౌడ్,చంద్రయ్య గౌడ్,గౌడ కులస్తులు, తెరాస మండల అధ్యక్షులు వారాల రమేష్ యాదవ్, తిప్పారావ్ రమ్య,మండల సమన్వయకర్త మట్లపల్లి సునీత రాజు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య గౌడ్, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీడమ్ కప్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రం లోని వివేకానంద మినీ స్టేడియం లో స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా క్రీడాకారులతో కరచాలనం చేసి, ఫ్రీడం కప్ ను ప్రారంబించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ గారు,లైబ్రరీ చైర్మెన్ డా చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... జగిత్యాల జిల్లా నలుమూలల నుండి వచ్చిన యువతకు స్వాగతం అన్నారు. క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతి గ్రామం, పట్టణాలలో క్రీడా మైదానాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు అని అన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా యువత ను భాగస్వామ్యం చేసి దేశభక్తి, స్నేహ భావంతో ఉండాలనే విధంగా ఫ్రీడం కప్ పోటీల ముఖ్యమంత్రి అలోచన అని అన్నారు .రాష్ట్రంలో వజ్రొత్సవాల నిర్వహణ ఘనంగా ఉందని అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.... మానవ జీవితమే ఒక చదరంగం అని,జీవితాన్ని గెలుపు ఓటముల తో పోలుస్తారు అని,గెలుపు ఓటములు సహజం అని అన్నారు,ఓటమి అనేది గెలుపు కు తొలి మెట్టు గా భావించాలి అని అన్నారు. లైబ్రరీ చైర్మెన్ మాట్లాడుతూ.... క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా మెళకువలు నేర్చుకోవాలని, కామన్వెల్త్ క్రీడల్లో దేశ, తెలంగాణ క్రీడాకారులు అద్భుతంగా రాణించారు అని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్



మాట్లాడుతూ.... శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ, స్పోర్ట్స్ అధికారి డా. నరేష్, మున్సిపల్ కమిషనర్ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

# 18 నుండి హుస్నాబాద్ నియోజకవర్గంలో పొన్నం పాదయాత్ర

**చిగురుమామిడి ఆగస్ట్ 16 (ప్రజా మంటలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన పాద యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్ పిలుపునిచ్చారు. పొన్నం పాదయాత్రకు సంఘీ భావం తెలుపడానికి మంగళవారం రోజు చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చిటుమల్ల రవీందర్ సారథ్యం లో మానకొండూర్ నియోజకవర్గం గట్టుదుద్దెనపల్లి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చిటుమల్ల రవీందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పొన్నం ప్రభాకర్ నిర్వహిస్తున్న యాత్ర లో భాగంగా గట్టుదుద్దెనపల్లి ఫంక్షన్ హాల్ లో ప్రభాకర్ ను కలిసి సంఘీ భావం తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 18న పొన్నం పాద యాత్ర హుస్నాబాద్ నియోజక వర్గం లో ప్రవేశిస్తున్న సందర్భంగా హుస్నాబాద్ నియోజక వర్గ పరిధి లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి పాద యాత్రను విజయవంతం చేయాలని కోరారు. చిటుమల్ల రవీందర్ వెంట పొన్నం పాదయాత్ర కు సంఘీ భావం తెలుపడానికి వెళ్లిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, జిల్లా అధికార



ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్ నేత, ములుకనూరు గ్రామశాఖ అధ్యక్షుడు పూదరి వేణు తదితరులున్నారు.

## మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో

# సామూహిక జాతీయ గీతాలాపన

**కొడిమ్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండలం హిమ్మత్ రావు పేట గ్రామంలో నిర్వహించిన సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పుణుగోటి కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా రామడుగు సింగిల్ విండో అధ్యక్షులు తెరాస రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమములో తిర్మలపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, ఉపసర్పంచ్ అరె లతశ్రీ – శ్రీనివాస్, ఏఇఓ గ్రీష్మ, పంచాయతీ కార్యదర్శి పావని, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకునూరి మల్లయ్య, రైతు విభాగం అధ్యక్షులు బండి రాజేందర్, వైద్యాధికారి నవనీత అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్, వార్డు సభ్యులు, కారొబార్, గ్రామపంచాయతి సిబ్బంది, మరియు గంగారాం తండా సర్పంచ్ భోజ్య నాయక్ నాయకులు బోలుమల్ల గంగరాజం, బొమ్మకంటి



సాగర్, ఐలాపురం బాలరాజు, నరెడ్ల గౌతమ్ రెడ్డి, రంజిత్ రావు, మహేష్, నీలం వెంకన్న, గ్రామస్థులు విద్యార్థులు పాల్గొని సామూహిక గీతాలాపన చేశారు.

# బాలాజీ నగర్ రేణుక ఎల్లమ్మ గుడిలో గాజుల పూజ

**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** శ్రావణమాసం పురస్కరించుకొని జనగామ పట్టణ మూడో వార్డు పరిధిలోని బాలాజీ నగర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి మహాలక్ష్మి గా దర్శనమిచ్చింది. అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం శ్రావణ మాసం సర్వ శుభప్రదమని లోక కళ్యాణార్థమై మహిళలు సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారిని గాజులతో అలంకరించి గాజుల పూజ, సహస్ర కుంకుమార్చనలను ఆలయ పూజారులు ఆలయ పూజారులు మాదాసు రాజేశ్వర్ భార్గవ, మాదాసు లలితా భార్గవ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి కట్నకానుకలు సమర్పించారు. భక్తి గీతాలతో సహస్ర పారాయణాలతో అలరించారు. అనంతరం మహిళలందరికీ పసుపు కుంకుమ బొట్టు గాజులు పంపిణీ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు మెరుగు సరోజన, లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, బొడ్డు లక్ష్మి,



దోసపాటి శ్రీలక్ష్మి, గట్టు విజయ, సంబోజు జ్యోతి ఆలేటి జ్యోతి, మమతారెడ్డి, మాదారపు కల్పన, స్వాతి, కంసాని సునీత, వాణి, మంగ మమత, హరీషా, టీ. విజయ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధిపేట్ జిల్లా కోహెడ లో అంబేద్కర్ విగ్రహం వద్ద సామూహిక గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై జి నరేందర్ రెడ్డి.



కరీంనగర్ పట్టణంలో ఘనంగా సామూహిక జాతీయ గీతాలాపనలో పాల్గొన్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ సునీల్ రావు, జడ్పీ ఛైర్పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ అర్ వి కర్ణన్, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ సేవా ఇస్లవత్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్ రావు, సుడా చైర్మన్ జివి కృష్ణారావు మరియు అధికారులు

# విజయవంతంగా జరిగిన జాతీయ గీతాలాపన

**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** జనగామ లో స్వతంత్ర భారత వజ్రోత్సవాల ద్విసప్తాహ కార్యక్రమాల్లో భాగంగా చౌరస్తాలో ఉ.



11:30 గంటలకు చేపట్టిన జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య మున్సిపల్ చైర్మన్ పోకల జమున, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఎ పిడి రామ్ రెడ్డి, ఆర్డిఓ మధుమోహన్, రెండవ వార్డ్ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు రోజా, రాణి, సంధ్యారాణి, లత, జయంతి, ఉమారాణి, రాము శ్రీధర్, రామరాజు తదితరులు



స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా మల్లాపూర్ మండలం కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ గీతలాపన లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



తరిగొప్పుల స్వాతంత్ర భారత వజ్రోత్సవాలలో సామూహిక జాతీయ గీతాలాపన చేసిన గ్రామ సర్పంచ్ దామెర ప్రభుదాస్, జెడ్పిటిసి ముద్దసాని పద్మజా వెంకట్ రెడ్డి, ఎమ్మార్వో అరుణ, ఎంపీపీ జొన్నగాని హరిత సుదర్శన్ గౌడ్, ఎంపిటీసీ అర్జుల మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో జయరావు, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ చందర్, జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. శ్రీదేవి, అర్జుల రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వివిధ పార్టీ నాయకులు, యువకులు, ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది

# వచ్చే రెండేళ్లకు మోడీ తన చిత్తశుద్ధిని ప్రకటించాలి!

మరో ఇరవై ఐదేళ్లలో పూర్తిస్థాయిలో దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై నుంచి తన సంకల్పాన్ని ప్రకటించారు. ఏ దేశానికైనా లక్ష్యం ఉండాల్సిందే. లక్ష్యం మేరకు ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి. అయితే అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాల్సిందే. ఆ లక్ష్యాలు ఏ మేరకు సాకారం అయ్యా యన్నదే ముఖ్యం. ఎవరైనా ఏదైనా విజయం సాధించారంటే గతాన్ని చూస్తారు. గతంలో ఏం చేశారన్నదే ప్రాతిపదికగా ముందుకు సాగాలి. ఈ ఎనిమిదేళ్లలో ప్రధాని మోడీ ఏమేం చేశారన్నది ముఖ్యం. ముఖ్యంగా ప్రజలు ఏ మేరకు బాగుపడ్డారన్నదే ప్రాతిపదికగా తీసుకోవాలి. దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్ అన్న మన గురజాడ సూక్తి ఎప్పటికీ ఆదర్శమైన నీతవాక్యం. కానీ మన పాలకులు ప్రజలను పక్కన పెట్టి పథకాలతో కుస్తీ పడుతున్నారు. కేవలం ఎన్నికల కోసమే పథకాలు ప్రవేశ పెట్టి, ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తే మరో 75 ఏళ్లయినా మనం పురోగమించలేం. మానవ వనరులను ఉపయోగించు కుని ముందుకు సాగాల్సి ఉన్నా..130 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో వారికి తగ్గట్లుగా మౌళిక సదుపా యాలు కల్పించలేకపోయాం. నేటికీ విద్యుత్, మంచినీరు లేని గ్రామాలు అనేకం. ఇళ్ల సంగతి సరేసరి. స్వచ్ఛభారత్ ప్రచారం జరిగినంతగా మరుగుదొడ్ల నిర్మాణాలు జరగలేదు. ప్రజలు తమ కొనుగోలు శక్తిని కోల్పోయారు. తినడానికి తిండి, కట్టడానికి బట్ట లేకుండా..పథకాల పేరుతో ప్రజలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలను ఏమనాలి. నిజానికి ముందుగా ప్రజలకు సంక్షేమం కన్నా...బతకగలిగేలా ప్రణాళికలు సిద్ధం కావాలి. గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం కావాలి. ప్రజలు కనీస వసతులు కల్పించుకునే అవకాశం ఇవ్వాలి. ఏది కొనాలన్నా అందుబాటులో లేదు. జిఎస్టీ వాయింపులతో ప్రజలు నానాయాతన పడుతున్నారు. ఇవన్నీ గమనించకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకోకుండా భవిష్యత్ ప్రణాళిక రచించడం ప్రజలను మోసం చేయడం తప్ప మరోటి కాదు. గత ఎనిమిదేళ్లలో సాధించిన విజయాలతో పాటు..వైఫల్యాలపై ముందుగా చర్చ సాగాలి. అలా చెప్పకుండా రానున్న రోజుల్లో మరింత ప్రగతిని సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పడంలో అర్థం లేదు. ముందు ప్రజలు బతకగలిగే పరిస్థితులు తీసుకుని రావాలి. ఆకలితో ఉన్న వాడికి ముందు ముద్ద పెట్టండని చెప్పిన స్వామి వివేకానందుడి సూక్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలు బతకగలిగే పరిస్థితులను సృష్టించాలి. వారికి ఉచితంగా ఏమీ ఇవ్వాల్సిన అసవరం లేదు. బతక డానికి అవకాశాలు కల్పించాలి. అప్పుడే 2047లో జరిగే శతాబ్ది స్వాతంత్ర్య ఉత్సవాల నాటికి దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని గుర్తించాలి. ఇకపోతే మరో 25 ఏళ్ల వరకు ఇప్పుడున్న వారిలో పావు వంతు ఉండకపోవచ్చు. వచ్చే 25 ఏళ్ల కోసం పంచసూత్రాలను ప్రకటించి... వీటిని ప్రధాని మోడీ 'పంచ ప్రాణ్'గా అభివర్ణించారు. వీటిని అమలు చేయడం ద్వారా దేశం ముందుకు పోతుందన్నారు. దేశాభి వృద్ధికి అవినీతి, బంధుప్రీతి పెద్ద సవాళ్లుగా మారాయని ప్రకటించారు. నిజానికి రాజకీయ అవినీతిని మించిన అవినీతి దేశంలో మరోటి ఉండదు. కాబట్టి మరో రెండేళ్ల పదవీకాలంలో రాజకీయ అవినీతికి మోడీ సంకల్పం తీసుకోవాలి. ఎందకంటే దేశరాజకీయాల్లో అవినీతి, బంధుప్రీతి రెండు పెద్ద సవాళ్లను ఎదుర్కొం టోంది. అవినీతి బంధుప్రీతిపై ప్రముఖ కవి శ్రీశ్రీ తెలుగు పాటలో 60 ఏళ్ల క్రితమే ప్రస్తావించారు. వీటిని సకాలంలో పరిష్కరించకపోతే, అవి మరింత తీవ్రంగా మారుతాయని ఆనాడే తన పాట రూపంలో హెచ్చరించారు. అవినీతికి వ్యతిరేకంగా దేశం



చేస్తున్న పోరాటం నిర్ణయాత్మక దశలోకి ప్రవేశిస్తోందని చెప్పిన మోడీ...అవినీతితో బ్యాంకులను ముంచిన వారి గురించి చెప్పాలి. ఎందరు పెద్దలు బ్యాంకులకు ఎగనామం పెట్టారో వారి ఆస్తులను ఎందుకు జప్తు చేయ లేక పోతున్నారో చెప్పాలి. బ్యాంకులను ముంచిన వారి జాబితాను బయటపెట్టి వారి భరతం పట్టండి. రాజకీయ అవినీతిని ముందుగా తన పార్టీ నుంచే ప్రారంభించాలి. పెద్దపెద్ద వాళ్లు కూడా తప్పించుకోలేరని చెప్పిన ప్రధాని ముందుగా ఆ పనిచేసి చిత్తశుద్ధిని చాటుకోవాలి. బంధుప్రీతి గురించి తాను మాట్లాడినప్పుడు, రాజకీయాల గురించి మాత్రమే మాట్లాడుతున్నానని అనుకుంటారని అన్నారు. దురదృష్టవశాత్తూ, రాజకీయ రంగంలోని ఆ దుర్మార్గం దేశంలోని అనేక సంస్థలకు వ్యాపించిందన్నారు. దేశాన్ని వంశపారంపర్య రాజకీయాల నుండి విముక్తం చేయాలని, ప్రతిభ ఆధారంగా ముందుకు తీసుకెళ్లాలని చేసిన వ్యాఖ్యలను ప్రజలంతా స్వాగతిస్తున్నారు. రాజకీయ అవినీతిని, వారసత్వ రాజకీయాలను తుదముట్టించాల్సిందే. అలాగే ఏళ్లతరబడి చట్టసభల్లో పాతుకుపోకుండా చట్టం చేయాలి. పేదలకు, అణగారిన వర్గాలకు పాలించే హక్కు రావాలి. అందుకు అమెరికా తరహాలో నిర్ణీత కాల వ్యవధి విధించాలి. ఎమ్మెల్యేలు, ఎంపిలు రెండు టర్మ్‌లకు మించి ఎన్నిక కాకుండా నిరోధించే చట్టం తీసుకుని రావాలి. దేశంలోని ప్రతిభావంతులు, అర్హులకే అవకాశాలు దక్కాలని, మహిళలకు మరిన్ని అవకాశాలు దక్కాలని అంటున్న ప్రధాని మోడీ ముందుగా మహిళలకు రాజకీయంగా రావాల్సిన రిజర్వే షన్లు వచ్చేలా చేయాలి. చట్టసభల్లో వారికి పెద్దపీట వేయడం ద్వారా మోడీ తన ఆచరణను ప్రారంభించాలి. వచ్చే 25 ఏళ్ల నాటికి శతాబ్ది ఉత్సవాలను అభివృద్దిన భారత్‌గా ఆవిష్కరించాలన్న సంకల్పానికి అనుగుణంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవాలి. తనకున్న ఈ రెండేళ్ల పదవీ కాలాన్ని అందుకు ప్రాతిపది కగా చేసుకుని కార్యక్రమాలను చేపడితేనే ప్రజలు విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా జాతి సంపద, ఐక్యతను కాపాడుతూ వచ్చే 25ఏళ్లలో భారత్‌ను సమున్నత దేశంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తున్నామన్న విశ్వాసం కల్పించాలి. ఇప్పటి వరకు జరిగిన పొరపాట్లపై చర్చించాలి. ప్రజల సమస్యలపై దేశంలో పెద్ద ఎత్తున చర్చ చేయాలి. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చించాలి. పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవాలి. పార్లమెంటులో చర్చలకు అవకాశం ఇవ్వాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం,ఆహారాధాన్యాల అందుబాటు, మంచినీరు, ఆహారం,విద్యుత, రోడ్లు వంటి మౌళిక సదుపాయాలపై చర్చించకుండా లక్ష్యాన్ని చేరుకోలేం. పెద్ద సంకల్పాలతో ముందుకు కదలాలంటే ముందుగా చిన్నచిన్న సమస్యలను పరిష్కరించు కోవాలి. అప్పుడే స్వాతంత్య్ర శతాబ్ది ఉత్సవాల నాటికి 'భారత్ అభివృద్ధి చెందిన దేశ'మనే కల సాకారం కాగలదు. లక్ష్యం ప్రకటించిన మోడీ చిత్తశుద్ధిని కూడా ప్రకటించి ముందుకు సాగితేనే ..ప్రజలరు విశ్వసిస్తారు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

## బాధ్యతా రాహిత్యం

రామాపురంలో రైతు భద్రయ్యకు పెళ్ళయిన పది సంవత్సరాలకు లేక లేక కొడుకు పుట్టాడు. వాడికి రాము అని పేరు పెట్టుకొన్ని అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. భార్యాభర్తలిద్దరూ రామును నెత్తిన ఎక్కించుకొని బాగా గారాబం చెయ్యడం వలన వాడికి ఆడిందే ఆటగా, పాడిందే పాటగా అయ్యింది. బద్ధకం ఎక్కువై ఏ పని చేసేవాడు కాదు. చదువు పట్ల తీవ్ర నిర్లక్ష్యం వలన అక్షరం ముక్క అబ్బలేదు.

రాముకు యుక్త వయస్సు వచ్చినా, వాడి వైఖరిలో ఏం మార్పు లేదు. ఇంట్లో ఉన్నదంతా తీసుకొని స్నేహితులతో షికార్లు, సరదాలతో పాటు జూదం కూడా ఆడేవాడు. భద్రయ్యకు వయసు మీరి పోవడం వలన మునపటి వలే పొలం పని చెయ్యలేక పొలాన్ని కౌలుకు ఇచ్చేసాడు. వరుసగా అనావృష్టి వలన వ్యవసాయం కుదా ఫలవంతం అవడం లేదు. కొడుకు వైఖరి చూసి భద్రయ్యకు బెంగ ఎక్కువయ్యింది. కుటుంబం ఒక పక్క చితికిపోతుంటే మరొక పక్క రాముకు భద్రతా రాహిత్యం ఎక్కువైపోతోంది. పెళ్ళి చేస్తే బాగుపడతాడని బంధువులు ఇచ్చిన సలహాతో రాము పెళ్ళి పొరుగూరు అమ్మాయితో చేసాడు కాని ఏమి ప్రయోజనం లేకపోయింది.

రాబడి తగ్గిపోయి ఖర్చులు ఎక్కువైపోవడం తో కుటుంబం అప్పుల పాలయ్యింది. మనోచింతతో భద్రయ్య మంచం పట్టి చనిపోయాడు. ఆ బాధ తట్టుకోలేక తల్లి మంచం పట్టింది. సంపాదన లేక, ఊళ్ళో అప్పులు పుట్టక, తల్లికి వైద్యం చేయించలేక, భార్య కోరికలు తీర్చలేక రాము సతమతమవసాగాడు. ఇక ఈ సంసారం ఈదడం నా వలన కాదని, ఒక రాత్రి చెప్పాపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు.

నాలుగు రోజుల ప్రయాణం తర్వాత ఒక ఊరు చేరి సత్రం లో బస చేసాడు రాము. అక్కడే ఇద్దరు స్నేహితులు కూడా బస చేసారు. వారి మాటలను యధాలాపంగా విన్న రాముకు ఎన్నో కొత్త సంగతులు తెలిసాయి. వారిలో ఒకరికి ఒక చెయ్యి మాత్రమే వుంది. అయినా అతను దర్జీ పని నేర్చుకొని ఒక చేత్తోనే దర్జీ పని చేసుకుంటున్నాడు, రెండు చేతులా సంపాదిస్తూ హాయిగా జీవితం గడుపుతున్నాడు. ఇంకొక స్నేహితుడికి రెండు కాళ్ళు చిన్నప్పుడే చచ్చుబడిపోయాయి.అయినా తన ఊరిలో వైద్యుడి వద్ద మెలకువలు నేర్చుకొని



మూలికలతో మందులు చేసి ఆ ఊరివారికి వైద్యం చేస్తున్నాడు.

దేవుడు పుట్టుకతోనే వారికి వైకల్యం పెట్టినా వారిద్దరూ వాటిని తల్చుకుంటూ కుమిలి పోలేదు. వున్నవాటినే ఆసరాగా చేసుకొని ఆత్మ విశ్వాసం, మనో ధైర్యంతో జీవితంలో ముందడుగు వేస్తున్నారు వారిద్దరూ. అంగవైకల్యం అనేది తమ ప్రగతికి అడ్డంకి కానే కాదని నిరూపించారు వారిద్దరూ. వారిద్దరూ మాట్లాడుకునే మాటలలో తమకు అంగ వైకల్యం వున్నదని గాని, అందరికీ అన్నీ ఇచ్చిన దేవుడు తమకు అంగ వైకల్యం ఇచ్చాడన్న అక్కసు గాని ఎక్కడ వినిపించలేదు. సానుకూలంగా ఆలోచిస్తూ మెరుగైన భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

వారి మాటలతో రాముకు జ్ఞానోదయం అయింది. వారికి అంగవైకల్యం వున్నా దానిని అధిగమించి జీవితాన్ని ఆనందంగా మలచుకున్నారు. తనకు అన్ని అంగాలు ఆరోగ్యంగా వున్నా బద్ధకం, అలసత్వం, సోమరితనం అనే మనోవైకల్యాలతో జీవితంలో వైఫల్యాల ఊబిలో కూరుకుపోయాడు. విచక్షణా జ్ఞానం కోల్పోయి , బాధ్యతారహితం గా ప్రవర్తించి తండ్రిని కోల్పోయాడు. కుటుంబాన్ని పతనావస్థకు దిగజార్చాడు. ఇప్పుడూ భాధ్యతలను తలకెత్తుకోలేక ఇంటి నుండి పారిపోయి వచ్చాడు. తనెంత తప్పిదం చేసాడో రాముకు అవగతం అయ్యింది. ఈ క్షణం నుండి బాధ్యతతో మెలగి ,కష్టించి పని చేసి కుటుంబాన్ని పోషించుకొని మంచిపేరు తెచ్చుకోవాలన్న కృత నిశ్చయంతో కొత్త ఆలోచనా విధానం తో తిరిగి తన గ్రామానికి ప్రయాణం కట్టాడు రాము.

సి హెచ్ ప్రతాప్
91468 27505

## చందమామతో కొడవటిగంటి విడదీయరాని అనుబంధం

### ఆగస్టు 17...కొడవటిగంటి కుటుంబరావు వర్ధంతి

దాదాపు ముప్పై సంవత్సరాలుగా "చందమామ" సంపాదకవర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు.

చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి. తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశితంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుంబాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు %--% వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర? త్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ %--% పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు. కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 – 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు.

కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు. ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా



రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927–29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు.

1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 – 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950–51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు.

జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో...నాకు ఒకటే ఆశయం %--% నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు. 1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# వాజ్‌పేయ్‌కు నేతల ఘన నివాళి

### సదైవ అటల్ వద్ద శ్రద్ధాంజలి ఘటించిన ప్రముఖులు

### రాష్ట్రపతి ముర్మ, ప్రధాని మోడీ తదితరుల నివాళి

న్యూఢిల్లీ,ఆగస్ట్16 దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయా నాలుగో వర్ధంతి సందర్భంగా ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ పలువురు ప్రముఖులు మాజీ ప్రధానికి పుష్పాంజలి ఘటించి స్మరించుకున్నారు.భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహ పలువురు కేంద్ర మంత్రులు నివాళులు అర్పించారు. దిల్లీలోని వాజ్‌పేయా స్మారకం 'సదైవ్ అటల్'కు తరలివెళ్లి.. ఆ మహానేత సేవలను స్మరించుకున్నారు. వీరితో పాటు వాజ్‌పేయి దత్త కూతురు నమితా కౌల్ భట్టాచార్య సైతం ఈ నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని వాజ్ పేయి స్మారకం సదైవ్ అటల్ దగ్గరకు చేరుకున్న నేతలు అటల్ బిహారీ వాజ్ పేయికి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు వాజ్‌పేయా స్మారకార్థం ఏర్పాటు చేసిన ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. భాజపా అధికారంలోకి రావడంలో వాజ్‌పేయా కీలక పాత్ర పోషించారు. వాజ్‌పేయా నేతృత్వంలోని నేషనల్ డెమోక్రాటిక్ అలియన్స్(ఎన్‌డీఏ) ప్రభుత్వం 1998–2004 వరకు అధికారంలో ఉంది. భాజపా నుంచి ప్రధాని అయిన తొలి నేతగా గుర్తింపు పొందారు. ఆయన మూడు సార్లు ప్రధానిగా సేవలను అందించారు. 1996లో ప్రధాని అయినప్పటికీ ఆయన ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేదు. మళ్లీ 1998, 1999లో ప్రధానిగా ఎన్నికయ్యారు. అనారోగ్య కారణాలతో దిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ 2018, ఆగస్టు 16న 93 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆయనకు 2015లో ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. వాజ్‌పేయి 1924 డిసెంబరు 25న మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్‌లో జన్మించారు. వాజ్ పేయి దేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించి.. నిస్వార్ధ రాజకీయ నాయకుడిగా అందరి మన్ననలు అందుకున్నారు. 1996లో 13 రోజులు, 1998,99 కాలంలో 13 నెలలు, 1999 నుంచి 2004 వరకు ఐదేళ్ల పాటు పూర్తికాలం ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖ మంత్రిగా అటల్ పనిచేశారు. జనతా ప్రభుత్వం కూలిపోయినప్పుడు .. భారతీయ జనసంఘ్ లోని ఇతర సభ్యులతో కలిసి భారతీయ జనతా పార్టీ పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ తర్వాత 15 ఏళ్లపాటు దేశమంతా పర్యటించి పార్టీ విస్తరణలో వాజ్ పేయి కీలక భూమిక పోషించారు. తన రాజకీయ జీవితంలో ఆయన 10 సార్లు లోక్ సభ, 2 సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1957లో బలరాంపూర్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా వాజ్ పేయి లోక్ సభకు ఎన్నికయ్యారు.



## తెల్దారుపల్లిలో కృష్ణయ్య అంత్యక్రియలు

ఖమ్మం,ఆగస్ట్16: తెల్దారుపల్లిలో హత్యకు గురైన టీఆర్ఎస్ నాయకుడు తమ్మినేని కృష్ణయ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. అశేష జనవాహిని వెంటరాగా ఆయన అంతిమాయాత్రలో ప్రజలు పాల్గొన్నారు. ఆయనకు ప్రజలు ఘనంగా నివాళి అర్పించారు. తమనేత కడపటిచూపు కోసం భారీగాతరలి వచ్చారు.కృష్ణయ్య అంత్యక్రియల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. అంతిమ యాత్రకు వెళ్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన అనంతరం గ్రామంలోకి పంపించారు. కృష్ణయ్య అంతిమ యాత్రలో మాజీ మంత్రి, టీఆర్ఎస్ సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. కృష్ణయ్య అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా తెల్దారుపల్లిలో నడిరోడ్డుపై దుండగులు టీఆర్ఎస్ నేత, టేకులపల్లి సహకార సంఘం డైరెక్టర్ తమ్మినేని కృష్ణయ్యను చంపారు. సోమవారం ఉదయం పొన్నేకల్ నుంచి టూవీలర్ మీద ఇంటికి వెళ్తున్న కృష్ణయ్యను ఆటోతో ఢీకొట్టారు. బైక్ పై నుంచి పడిన ఆయనను ఆటోలో వచ్చిన వ్యక్తులు కత్తులు, తల్వార్లతో హత్యచేశారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సొంతూరు తెల్దారుపల్లి. తమ్మినేని వీరభద్రానికి కృష్ణయ్య స్వయాన బాబాయి కొడుకు. హత్యకు కారణమనే అనుమానంతో వీరభద్రం సొంత తమ్ముడు తమ్మినేని కోటేశ్వరరావు ఇంటిపై స్థానికులు దాడి చేసి కారు, బైక్, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. తన కారును బంధువులు తీసుకెళ్లడంతో కృష్ణయ్య సోమవారం డ్రైవర్ కొప్పుల ముత్తేశం అలియాస్ ముత్తయ్యతో కలిసి టూవీలర్‌పై బయటకు వెళ్లారు. పొన్నెకల్లు రైతు వేదిక దగ్గర జాతీయ జెండా ఆవిష్కరించి, గుర్రాలపాడులో ఓ కుటుంబాన్ని పరామర్శించి, తిరిగి ఇంటికి వెళ్తుండగా.. మద్దులపల్లి డబుల్ బెడ్రూం ఇండ్ల దగ్గర వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. కృష్ణయ్య, ముత్తయ్య కిందపడగా, దుండగులు కత్తులు, వేటకొడవళ్లు, తల్వార్లతో తెగబడ్డారు. ముఖానికి కృష్ణయ్య చేతులు అడ్డు పెట్టుకోవడంతో రెండు చేతులను మణికట్టు వరకు నరికేశారు. నరికిన చేతులను తీసుకొని దుండగులు అదే ఆటోలో పారిపోయారు. డ్రైవర్ ముత్తయ్యను కూడా చంపుతామని బెదిరించడంతో అక్కడి నుంచి ఆయన ఊర్లోకి పరిగెత్తి, కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా రక్తపు మడుగులో పడి కృష్ణయ్య అప్పటికే చనిపోయారు. ఆటోలో ఆరుగురు వచ్చారని, అందులో నలుగురు ఆటో దిగి దాడి చేశారని ప్రత్యక్ష సాక్షి ముత్తయ్య పోలీసులకు చెప్పారు. దాదాపు 20 ఏండ్ల కింద తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడు యేగినాటి వెంకటయ్య ఊరి చౌరస్తాలో టీడీపీ జెండా దిమ్మెను ఏర్పాటు చేయగా.. ప్రత్యర్థులు అతడ్ని చంపారు. టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తమ్మినేని కృష్ణయ్యకు కూడా పలుసార్లు బెదిరింపులు వచ్చాయి. తనపై దాడి జరిగితే అది సీపీఎం గూండాల పనేనని కృష్ణయ్య చాలా సార్లు కామెంట్ చేశారు. తనకు సెక్యూరిటీ ఇవ్వాలని ఆయన ఆరునెలల క్రితం పోలీసులను కోరినట్టు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. రాజకీయ విభేదాలు తీవ్రంగా ఉన్న తెల్దారుపల్లిలో ఒక్క సీసీ కెమెరా కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో మెయిన్ రోడ్డు మీద నుంచే పారిపోయిన నిందితులను గుర్తించే అవకాశం లేకుండా పోయింది. హత్య తర్వాత పోలీసులు గంట ఆల్యసంగా ఘటనాస్థలానికి చేరుకోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య వెనుక తమ్మినేని వీరభద్రం, ఆయన తమ్ముడు తమ్మినేని కోటేశ్వరరావు ప్రమేయం ఉందని మృతుడు కృష్ణయ్య భార్య మంగతాయి, కుమార్తె రజిత, కొడుకు నవీన్ ఆరోపించారు. వీరభద్రం, కోటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల వైఫల్యం వల్లే కృష్ణయ్యను కోల్పోయామన్నారు. షేక్రంజాన్, జక్కంపూడి కృష్ణ, గజ్జి కృష్ణస్వామి, నూకల లింగయ్య, బండ నాగేశ్వరరావు, బోడపట్ల శ్రీను, ఎల్లంపల్లి నాగయ్య హత్యలో పాల్గొన్నారని రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు గ్రామంలో 144 సెక్షన్ ఆంక్షలు విధించినట్లు పోలీస్ కమిషనర్ విష్ణువారియర్ చెప్పారు. దుండగుల కోసం నాలుగు పోలీస్ బృందాలు గాలింపు ప్రారంభించాయన్నారు.

## బీర్పూరు ఉగ్ర నారసింహుని వరద పాశ మహోత్సవాలకు ఏర్పాట్లు

రామ కిష్టయ్య సంగన భట్ల...

ధర్మపురి ఆగస్ట్ 16 (ప్రజా మంటలు బ్యూరో) : "స్వర్ణాసన పీఠాయ దండకారణ్యవాసినే, శ్రీమద్భీర్పురీశాయ శ్రీనృసింహాయ మంగళం:" రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ధర్మపురి సమీపస్థ, భీర్పూర్ మండల కేంద్ర సమీప లక్ష్మీనరసింహ స్వామి వెలసిన పెద్ద గుట్ట వద్ద ఉత్సవాలు ఆగస్టు 17వ తేదీ బుధవారం సనాతన సంప్రదాయ రీతిలో జరుగనున్నాయి. ఈ కార్యక్ర మంలో భాగంగా...పెద్ద గుట్ట స్వయంభూ శ్రీ ఉగ్ర లక్ష్మీ ఉగ్ర నరసింహ స్వామి వారి దర్శనం, వరద పాశ





మహోత్సవం భక్త జన సమక్షంలో ఈ నెల ఎ7న నిర్వహించనున్నారు.
ఏడాది కోమారు మాత్రమే పెద్ద గుట్ట పైన జరిగే స్వామివారి ఉత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధి కారులు వలసిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. భీర్పూర్ గ్రామ శివార్లలో పెద్దగుట్ట, చిన్న గుట్టలపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి భక్తుల పాలిటి కరుణా కటాక్ష మూర్తిగా, దుష్ట శిక్షకుడుగా, శిష్ట రక్షకుడుగా పేరెన్నిక గన్నారు. పూర్వం అవుసుల ధర్మయ్య అనే అధ్యాపకుడు, తన కుమారు నితో విభేదించి, స్వామిని ఆశ్రయించాడని, ఆచార వ్యవహారాలు, సాంప్రదా యాలను తులనాడే తన కుమారున్ని కడతేర్చి పరువు కాపాడితే, కస్తూరి తిలకాన్ని స్వామికి దిద్దగలనని ధర్మయ్య మొక్కు కోగా, అదేవిధంగా జరగడంతో, వెంటనే మొక్కు తీర్చు కున్నాడనే కథ ఈ ప్రాంతంలో మిగుల ప్రచా రంలో ఉంది. నేరేళ్ళ గ్రామానికి చెందిన ఒక గొల్ల బాలుడు, మేకలను మేపుతూ, ఒక రోజున చిన్నగు ట్టపైకి వెళ్ళగా, బాలుని రూపంలో వచ్చిన స్వామి తన దాహం తీర్చమని ఆబాలుని కోరారు. మేకలన్నింటిని గుహలోనికి తోలుకెళ్ళి, వాటి పాలతో గొల్ల బాలుడు స్వామి దాహాన్ని తీర్చాడు. అలాగే గుట్ట దిగుతూ వెనుతిరిగి చూడగా తనమంద అనూహ్యంగా పెరగడాన్ని గాంచి, ఆశ్చర్య చకి తుడై, దానిని భగవత్కృపగా భావించి, నేరేళ్ళ సంస్థానా ధీశునికి జరిగిన విషయం చెప్పా డట. అంతకు ముందు రోజు స్వామి తనకు కలలో కనిపించి, ఆలయ నిర్మాణానికి సహకరించ మనడాన్ని గుర్తెరిగి, ఆయన వెంటనే నమ్మనా చార్యులకు కబురు పంపాడు.
ఆయన సహకారం తో, నమ్మనా చార్యులు అప్పటికే వెలసిన స్వామిని కనుగొని, భక్తి శ్రద్ధలతో పూజించి, ఆలయ నిర్మాణం పూర్తిగా వించడం జరిగింది. అప్పటినుండి ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్స వాలను నిర్వహిస్తు న్నట్లు చెపుతారు. దేవాలయ ఉత్సవ నిర్వహణకై ఖుతుబ్ షాహీల కాలంలో మాన్యాలు ఇవ్వబడినాయని, అయితే ఢిల్లీ సుల్తానులు, ఖుతుబ్ షాహీలపై దండెత్తి గోల్కొండను కైవసం చేసుకున్నాక, అట్టి మాన్యా లను రద్దు పరచినట్లు చెపుతారు. 1881లో నిజాం ప్రభువులు స్వామివారల పేరున ఉన్న మాన్యాలను ఆలయ ధర్మకర్తలు, ప్రధానా చార్యుడైన వొద్దిపర్తి రామానుజాచార్యుల నుండి తిరిగి తీసుకున్నారని చారిత్రికాధారాలున్నట్లు చెపుతారు. ఆ తర్వాత అర్చకులు తుంగూరు, భీర్పూరు, నర్సింహు లపల్లె తదితర గ్రామాల్లో భిక్షాటనచేసి ఉత్సవాలను నిర్వ హించారు. అదేవిధంగా అర్షకోట పరగణా క్రింద గల గ్రామాల ప్రజలు స్వామివారి ఉత్సవాల నిర్వహణకు కానుకలను సమర్పిండం అనవాయితీగా మారింది. అలాగే సదరు గుట్టకు ఆనుకుని ఉన్న పెద్ద గుట్ట పైన కూడా లక్ష్మీ నరసింహ స్వామి వెలసి ఉండగా సంవత్స రానికి ఒకే మారు ఆ గుట్టపైకి వెళ్ళి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం శతాబ్దాల ఆచరణ.
బీర్పూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఇఓ, పూజారులు వద్దిపర్తి సంతోషాచార్యులు, పెద్ద సంతోషాచార్యులు, మధు ఆచార్యులు, చిన్న సంతోష్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఒకేరోజు ఒకే సారి జరిగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్య లో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# వ్యవస్థలను అవమానిస్తున్న కేసీఆర్

## గవర్నర్‌కు అడుగుడునా అవమానాలే

## ఎట్‌హోం కార్యక్రమానికి డుమ్మా కొట్టడం దారుణం

## కేసీఆర్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్16: తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యవస్థలను అవమానిస్తున్నారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. గవర్నర్ తేనేటి విందుకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తులను, వ్యవస్థలను గౌరవించని దుస్థితిలో కెసిఆర్ ఉన్నారని ఘాటుగా విమర్శించారు. హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో



జరిగిన మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్ పేయి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని.. ఆమహానీయునికి నివాళులర్పించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో వ్యక్తులు శాశ్వతం కాదని.. వ్యవస్థలు శాశ్వతమన్నారు. కేసీఆర్ ఈరోజు ఉంటారు, రేపు పోతారు కాని వ్యవస్థలు ఎప్పటికి ఉంటాయన్నారు. ఓటమి భయంతోనే కేసీఆర్ తప్పుల మీద తప్పులు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గవర్నర్ ఏర్పాటుచేసిన 'ఎట్ హోం' కార్యక్రమానికి గైర్హాజరై సంప్రదాయాలను కేసీఆర్ మంటగల్పుతున్నారని ఆరోపించారు. గవర్నర్ పర్యటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించకపోవటం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సర్కారు గవర్నర్‌ను అడుగడుగునా అవమానాలకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ సర్కార్‌ను ప్రజలు పాతరేయటానికి సిద్ధంగా ఉన్నారని..తన కాళ్ళ కింద భూమి కదలిపోతోందన్న ఆందోళనలో కేసీఆర్ ఉన్నారని అన్నారు. బండి సంజయ్ పాదయాత్రపై టీఆర్ఎస్ శ్రేణులు దాడులు చేయడాన్ని కిషన్ రెడ్డి ఖండించారు. నిరాశ, నిస్పృహతో కేసీఆర్ ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కేటీఆర్ ఎప్పటికీ సీఎం కాలేడన్న ఫ్రస్టేషన్?లో కేసీఆర్ ఉన్నాడని..ప్రధాని మోదీ సహా కేంద్రానికి ఆయన సర్టిఫికేట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ కు ఏం చేశారని.. దేశాన్ని ఉద్ధరిస్తావంటూ ప్రశ్నించారు. ఇంజనీర్ల సూచనలను పక్కనపెట్టి సొంత ఆలోచనతో సాగునీటి ప్రాజక్టులను నిర్మించి..ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. సెంటిమెంట్ తో ముఖ్యమంత్రి కుర్చీలో కేసీఆర్ ఎక్కువ కాలం కూర్చోలేడని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యవస్థలను, సంప్రదాయాలను గౌరవించాలని పేర్కొన్నారు. గవర్నర్ ని, వ్యవస్థని సీఎం కేసీఆర్ అవమాని స్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా గెలిచే పార్టీ బీజేపీ అని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. మునుగోడులో తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. తమ పార్టీకి కేసీఆర్ భయపడుతున్నారని, కొడుకును సీఎం చేయలేకపోతున్నాననే ఆందోళన లో ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్ కుటుంబానికి ప్రధాని నరేంద్రమోదీ నచ్చకపోవచ్చని, దేశ ప్రజలకు నరేంద్రమోదీ అంటే ఇష్టమని తెలిపారు. టీఆర్ ఎస్ నాయకులు నిరాశ, నిసృ?పహలె ఉన్నారని.. అందుకే రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పాదయాత్రపై దాడులు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## కాశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### నదిలో బస్సుపడి ఏడుగురు జవాన్ల మృతి

శ్రీనగర్,ఆగస్ట్16: జమ్ముకశ్మీర్‌లో ఘోర ప్రమాదం జరిగింది.



పహల్గామ్‌లోని ఫ్రిస్లాన్ చందన్వారి రోడ్డు ప్రాంతంలో భద్రతా బలగాల వాహనం ప్రమాదానికి గురై నదిలో పడిపోయింది. బస్సు బ్రేకులు ఫెయిలవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఏడుగురు ఐటీబీపీ జవాన్లు చనిపోయారు. చాలా మంది సైనికులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని అధికారులు ఆసుపత్రికి తరలిస్తున్నారు. 'మంగళవారం ఉదయం 39 మంది ఐటీబీపీ జవాన్లతో ప్రయాణిస్తున్న బస్సు.. బ్రేక్‌లు ఫెయిల్ కావడంవల్ల పక్కన ఉన్న నదిలో పడిపోయింది. ఘటనాస్థలికి అధికారులు చేరుకున్నారు. అపార ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. అయితే బస్సులోని జవాన్లంతా అమర్‌నాథ్ యాత్రకు సంబంధించిన విధులు నిర్వర్తించి తిరిగి వస్తున్నారని ఐటీబీపీ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు

# రెండు ఒక్కటే

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. చౌటుప్పల్ ఎంపీపీ తాదురి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, మండల టీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పెద్దిటి బుచ్చి రెడ్డి, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కంది లక్ష్మా రెడ్డిలు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హుజూరాబాద్ ప్రజలు చెంప చెళ్లుమనిపించినా సీఎం కేసీఆర్ కు బుద్ధిరాలేదని మండిపడ్డారు. కేసీఆర్ వైఖరిపై పార్టీ నేతలకు వెగటు పుట్టి టీఆర్ఎస్ నుంచి బయటకు వస్తున్నారని అన్నారు. గులాబీ కండువాను వదిలేస్తున్న వారిపై కేసులు పెట్టి బెదిరించే



ప్రయత్నం చేస్తున్నారని ఈటల ఆరోపించారు. సొంత పార్టీ నేతలకే వెల కడుతున్న నీచమైన పార్టీ టీఆర్ఎస్ అని ఈటల రాజేందర్ మండిపడ్డారు. పిచ్చివేషాలు వేసి లొంగదీసుకుంటామంటే తెలంగాణ సమాజం లొంగదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్?ను ఎదుర్కొనే ఏకైక పార్టీ బీజేపీయే అన్న ఈటల.. బీజేపీ కార్యకర్తలు, నాయకులు మనోనిబ్బరం కోల్పోవద్దని సూచించారు. ఇన్నేళ్లు కష్టపడి పనిచేశామని, మరో 6 నెలలు ఇలాగే కష్టపడితే అధికారం మనదే అని భరోసా ఇచ్చారు. కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కి మునుగోడు టికెట్ ఇవ్వొద్దన్న అసమ్మతి నేతలను లీడ్ చేసి వెంకట్‌రెడ్డి గ్రూపు సమావేశం నిర్వహించారు. భూ వివాదాలతో వెంకట్‌రెడ్డిపై చౌటుప్పల్ పోలీసులు పలు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాదూరి వెంకట్ రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడం అర్ధరాత్రి కలకలం రేపింది. మునుగోడు ఉప ఎన్నికతో అధికార టీఆర్ఎస్ పార్టీలో మరోసారి గందరగోళం నెలకొంది. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కి వ్యతిరేకంగా గళం విప్పడంతో పోలీసులు అర్ధరాత్రి అరెస్టులకు తెరలేపారు. ఇదే క్రమంలో హైదరాబాద్, వనస్థలిపురం, తంగిరిళ్ళ అపార్టుమెంట్లో నివాసం ఉంటున్న చౌటుప్పల్ టీఆర్ఎస్ ఎంపీపీ తాదూరు వెంకట్ రెడ్డి ఇంటిని ఎస్వోటీ , సీసీఎస్ పోలీసులు చుట్టుముట్టారు. అరెస్టు చేసేందుకు యత్నించారు. చివరకు వెంకట్ రెడ్డి బీజేపీలో చేరడంతో మునుగోడు రాజకీయాలు హీటెక్కిస్తున్నాయి.

# రైతుబంధు పేరుతో మోసం చేస్తున్న కేసీఆర్

## కేంద్రం ఇచ్చిన బియ్యంతో బ్లాక్ మార్కెట్ దందా

## కేసీఆర్ పాలనలో రైతులకు తీవ్ర ఇబ్బందులు

## నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఫైర్

నిజామాబాద్,ఆగస్ట్16): రైతుబంధుతో రాష్ట్ర రైతులను కేసీఆర్ మభ్యపెడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన బియ్యంతో బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడిన దుర్మార్గులు టీఆర్ఎస్ నాయకులని ఫైర్ అయ్యారు.మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో వేల్పూర్ క్రాస్‌రోడ్డులో జరిగిన రైతు ధర్నాలో ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో రైతులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర ఇస్తోందని, వడ్ల కొనుగోళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నయా పైసా ఖర్చు పెట్టలేదని చెప్పారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని కేసీఆర్ పై మండిపడ్డారు. ఇటీవలి వరదలకు రైతులు ఇబ్బందులు పడుతోంటే అవేమీ పట్టించుకోకుండా సీఎం కేసీఆర్, మంత్రులు జల్సా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వి ఓటు బ్యాంక్ రాజకీయాలన్న అర్వింద్... రైతు రాజ్యం మోదీతోనే సాధ్యమని చెప్పారు. తనకంటే ముందు ఎంపీగా ఉన్న కల్వకుంట్ల కవిత పసుపు బోర్డు పేరుతో కాలయాపన చేసిందని, కానీ తాను ఎంపీగా గెలిచిన 5 నెలల్లోనే పసుపు రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రాన్ని ఒప్పించానని బీజేపీ ఎంపీ అర్వింద్ చెప్పారు. దిగుమతులు తగ్గించి నిజామాబాద్ నుంచి విదేశాలకు పసుపును ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. పసుపుకు అధిక మద్దతు ధర ఇవ్వడంతోపాటు పెద్ద మొత్తంలో బాయిలర్లు, టార్పాలిన్లు ఇచ్చామన్నారు. స్పైస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటు చేసి రూ.30 కోట్ల నిధులు తెచ్చానని అర్వింద్ పేర్కొన్నారు. తనకంటే ముందు ఎంపీగా ఉన్న కల్వకుంట్ల కవిత పసుపు బోర్డు పేరుతో కాలయాపన చేసిందని మండిపడ్డారు. బాల్కొండ నియోజకవర్గ పసుపు రైతులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ చిత్తు చిత్తుగా ఓడిపోవడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు జోస్యం చెప్పారు. దుబ్బాకలో జరిగిన రైతు ధర్నాలో రఘునందన్ రావు మాట్లాడుతూ... స్పైస్ బోర్డుకు, పసుపు బోర్డుకు తేడా తెలియని వ్యక్తి మంత్రి ప్రశాంత్ రెడ్డి అని విమర్శించారు. తాళ్ళ రాంపూర్ సొసైటీ అక్రమాలు మంత్రి ప్రశాంత్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగాయని ఆరోపించారు. ధర్నాలో పాల్గొనొద్దని మంత్రి ప్రశాంత్ రెడ్డి ఎన్ని ఇబ్బందులు పెట్టినా... రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాకు హాజరుకావటం చూస్తే మంత్రి ప్రశాంత్ రెడ్డి పని అయిపోనట్లేనని అర్థమవుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే షుగర్ ఫ్యాక్టరీ తెరుస్తానని... చెరుకు, పసుపు పరిశోధన కేంద్రాలను తెస్తానని చెప్పిన కేసీఆర్... ఎనిమిదేళ్లయినా తన హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఏక కాలంలో లక్ష రూపాయల రుణమాఫీ అని ప్రకటించిన కేసీఆర్... మాట తప్పారని విమర్శించారు. కేంద్రం



మద్దతు ధర ఇవ్వడం లేదని టీఆర్ఎస్ నాయకులు అబద్దాలు చెబుతున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర ఇస్తోందని స్పష్టం చేశారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీళు ఇవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయన్నారు. గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్లలో మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు జరగుతున్నాయన్న ఆయన... రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు నిర్మించారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద లక్షల సంఖ్యలో మోదీ ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోందన్నారు. కొత్త రాష్ట్రానికి దళితుడే తొలి సీఎం అని ప్రకటించిన కేసీఆర్... తన మాటను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రతి నియోజకవర్గానికి 100 పడకల హాస్పిటల్ నిర్మాణం పనులు ఎంతవరకు వచ్చాయని ఎద్దేవా చేశారు.

# బీహార్‌లో నితీశ్ కేబినేట్ విస్తరణ

**31 మంది మంత్రులతో ప్రమాణం చేయించిన గవర్నర్**
**తేజస్వీ సోదరుడు తేజ్‌ప్రతాప్‌కు సైతం కేబినేట్‌లో చోటు**

పాట్నా,ఆగస్ట్16: ఎన్డీఏ కూటమితో తెగదెంపులు చేసుకుని పాత మిత్రులతో కలిసి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సిఎం నితీశ్ కుమార్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు.ఇప్పటికే సీఎంగా నితీశ్, ఉప ముఖ్యమంత్రిగా ఆర్జేడీ నేత తేజస్వీ



యాదవ్ ప్రమాణం చేశారు. తాజాగా కేబినెట్ విస్తరణ చేపట్టారు. 31 మంది నేతలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన మంత్రుల చేత గవర్నర్ ఫాగు చౌహాన్ ప్రమాణం చేయించారు. మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ సైతం ఉన్నారు. బిహార్ కేబినెట్‌లో మొత్తం 36 మంత్రి పదవులు ఉన్నాయి. ఈ తరుణంలో కేబినెట్‌లో తేజస్వియాదవ్ ఆర్జేడీకి 16, నితీశ్ కుమార్ జేడీయూకు 11 స్థానాలు కేటాయించారు. అదే సమయంలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, హిందుస్థానీ ఆవామ్ మోర్చా జితిన్ రామ్ మాంఝీకి, మరో ఇండిపెండెట్ అభ్యర్థికి సైతం కేబినెట్ బెర్త్‌లు ఇచ్చారు. తాజాగా మంత్రివర్గ విస్తరణలో జెడియు హోంశాఖ, విద్య, భవన నిర్మాణం, మైనారిటీ వ్యవహారాలు, సాంఘిక సంక్షేమం, జలవనరుల శాఖలు దక్కించుకున్నది. ఇక ఆర్థిక, వాణిజ్య పన్నులు, ఆరోగ్యం, రోడ్డు నిర్మాణం, విపత్తు నిర్వహణ, పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖలు ఆర్‌జెడి దక్కించుకుంది. నితీష్‌కుమార్ బిజెపి మాదిరిగానే.. మహాఘట్‌బంధ్ కూటమికి మంత్రిపదవుల్ని ఇచ్చారని తెలుస్తోంది. ఆర్‌జెడి – జెడియు పొత్తుతో ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో నియమితులైన మంత్రులందరూ రాజ్‌భవన్‌లో మంగళవారం ఉదయం 11.30 ప్రమాణస్వీకారం చేయనునారు.

### లక్ష్మీబరాజ్‌కు పెరిగిన వరద ప్రవాహం

మహదేవపూర్,ఆగస్టు16: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీ బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత, గోదావరి వరద క్రమంగా పెరుగుతూ వస్తోంది. సోమవారం బరాజ్‌కు ఇన్‌ఎ÷–లో 5,52,600 క్యూసెక్కుల వరద రాగా, మంగళవారం 8,68,850 క్యూసెక్కులకు పెరిగింది.

# అడుగడుగునా అడ్డంకులు

భద్రాద్రి కొత్తగూడెం,అగస్టు16: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎల్పీ బృందం పర్యటన ఉద్రిక్తతల మధ్య సాగింది. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క, పోడెం వీరయ్య ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరామ్‌నాయక్ తదితరులు భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన చేపట్టింది.ఉదయం భద్రాచలం శ్రీరాముడిని దర్శించుకొని ఈ బృందం బయలుదేరింది. ఈ పర్యటనకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. సీఎల్పీ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ముందుకు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చాలా చోట్ల రోడ్లు తవ్వి, డీసీఎం వాహనాలను అడ్డుపెట్టారు. మావోయిస్టుల కదలికలున్నాయని అంటూ పోలీసులు అడ్డుకున్నారు. వారం రోజుల ముందే పర్యటన గురించి పోలీసులకు చెప్పామని భద్రత కల్పించకుండా ఇలా అడ్డుకోవడమేంటని సీఎల్పీ బృందం ప్రశ్నించింది. మూడు మార్గాల్లో పోలీసులు సీఎల్పీ బృందాన్ని అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఒకదశలో సీఎల్పీ బృందం రోడ్డుపై బైఠాయించింది. కార్లు ముందుకు తీసేందుకు కార్యకర్తలు ప్రయత్నించడం వాటిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ముంపు ప్రాంతాల్లో తాము పర్యటించకుండా అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షానికి అంతే బాధ్యత ఉంటుందని భట్టి అన్నారు. పేదలు ఓ వైపు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కోట్ల రూపాయలు ఉత్సవాల పేరుతో ఖర్చు చేస్తే ఉపయోగమేంటని భట్టి ప్రశ్నించారు. భద్రాచలంలో కరకట్ట నిర్మాణానికి %ఖూూ% ప్రభుత్వ హయాంలోనే అనుమతులు మంజూరయ్యాయని సీఎల్పీ బృందం తెలిపింది. భద్రాచలం నుంచి విడిపోయిన ఐదు గ్రామపంచాయతీల విషయంలో రాష్ట్రపతిని తాము త్వరలోనే కలుస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

# భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

## మూడో ప్రమాద హెచ్చరిక జారీ

## కృష్ణమ్మ పరవళ్లు.. శ్రీశైలం, సాగర్‌కు భారీగా వరద

హైదరాబాద్,అగస్టు16: వానలు, వరదలు తెలంగాణ వాసుల్ని ముఖ్యంగా భద్రాచలం జనాన్ని వదలడం లేదు. భద్రాచలం వద్ద గోదావరి 53 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఇక్కడి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే ఇక్కడ నీటిమట్టం 53 అడుగులకు చేరింది. ఈ రాత్రికి ఇక్కడి నీటిమట్టం 55 అడుగులకు చేరుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ప్రాంతంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నది. భారీ వానలు, వరదలతో కృష్ణానదిపై అన్ని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం జలాశయానికి 4,36,896 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. పది గేట్లను ఎత్తివేసి అధికారులు 4,47,896 క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 884.40 అడుగులు, గరిష్ఠస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలకు గాను 212.4385 నీరు నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.ఏపీ పవర్ హౌస్ నుంచి 29,200, తెలంగాణ పవర్ హౌస్ నుంచి 33,921 క్యూసెక్కులు, స్పిల్‌వే నుంచి 3,67,225 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది. మరో వైపు నాగార్జున సాగర్‌కు 3.69లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. 26 గేట్లను ఎత్తివేసి 3.17లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. 18గేట్లను పది అడుగులు, ఎనిమిదిగేట్లను ఐదు అడుగుల మేర ఎత్తివేశారు. డ్యామ్ పూర్తిస్థాయినీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 586 అడుగులు. పూర్తిస్థాయి నిల్వసామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. 300 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ప్రాజెక్టు నుంచి మొత్తం 3.69లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది.



# తాటి చెట్టుపై నుండి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**భీమదేవరపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి



మండలం ములుకనూర్ తాటి వనంలో జరిగింది. వివరాల్లోకి వెళితే గనబోయిన తిరుపతి (55) అనే గీత కార్మికుడు వృత్తిరీత్యా సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ములుకనూర్ గ్రామంలోని తాటి వనంలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. అక్కడే ఉన్న తోటి గీతా కార్మికులు కుటుంబీకులకు సమాచారం అందించగా, కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 లో వరంగల్ ఎంజీఎం తరలించారు. ఒక కాలు విరిగిందని ఆయన పూర్తిగా నడవలేని పరిస్థితిలో ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గీతా వృత్తినే నమ్ముకుని బ్రతుకుతున్న ఆయన కుటుంబం వీధినపడ్డదని, ఆయన కుటుంబానికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని గౌడ సంఘం నాయకులు కోరారు.



జనగామ జిల్లా చౌరస్తా లో ఉదయం 11:30 గం. లకు సామూహిక జాతీయ గీతాలాపన మానవ హారంతో పాల్గొన్న "మేము సైతం ఫౌండేషన్". పాల్గొన్న జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, జడ్ పి చైర్మన్ పాగల సంపత్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్

# వజ్రోత్సవ వేళ .. అంతా త్రివర్ణశోభితం - ఆటల పోటీలు

### పండగ వాతావరణంలో కబడ్డీ పోటీలు

**భీమదేవరపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** భారతదేశం 75 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకున్న వేళ ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యాన్ని





పురస్కరించుకుని మండలంలో ప్రతిచోట వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' పేరుతో ఈ వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్, జెడ్పీటీసీ వంగ రవి, ఎంపిడిఓ లంకపల్లి భాస్కర్, ఎస్సై ప్రవీణ్ కుమార్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ వెంకటేశ్వరరావు, తెరాస నాయకులు శరిఫోద్దీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న గుడికందుల తేజ




**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** "శతాబ్ది స్వాతంత్ర భారతదేశం – నా కల" అనే అంశంపై ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా రాసిన వ్యాసానికి గాను రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా జనగామ జిల్లాకు చెందిన గుడికందుల తేజ అవార్డు అందుకున్నారు. రాజభవన్, రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళసై సౌందర్య రాజన్ అధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతగా ఎంపికైన తేజకు 15 సోమవారం స్వాతంత్ర్య దినోత్సవం రాత్రి 9 గంటలకు హైద్రాబాద్ రాజభవన్ లో అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా తేజ అవార్డు అందుకోవడం ఇది రెండవసారి. గతంలో కరోనా సమయంలో లాక్ డౌన్ పై రాసిన వ్యాసానికి అవార్డు అందుకున్నారు. తేజకు అవార్డు రావడం పట్ల జనగామ కవులు, కళాకారులు రెడ్డి రత్నాకర్ రెడ్డి, పెట్లోజు సోమేశ్వరాచారి, సాంబరాజు యాదగిరి, జి.కృష్ణ, అయిలా సోమనర్సింహచారి, ఆకుల వేణుగోపాల్ రావు, చిలుమోజు సాయికిరణ్, పానుగంటి రామమూర్తి, జంగ వీరయ్య, రేణుకుంట్ల మురళీ, కొట్టే శ్రీలత, బుదారపు లావణ్య పాల్గొన్నారు.

# మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

- **ముమ్వన్నల జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక**
- **మంత్రి కొప్పుల ఈశ్వర్**
- **గౌలిదొడ్డి గురుకులంలో ఘనంగా జరిగిన జాతీయ గీతాలాపన**

**హైదరాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అంతకు పూర్వం బ్రిటీష్ పాలనలో మన పెద్దలు దయనీయ జీవితాలు గడిపారని, ఈ 75ఏండ్లలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని, చాలా మార్పులు చోటు చేసుకున్నా యన్నారు. నగర శివార్లలోని గౌలిదొడ్డి ఎస్సీ గురుకుల కళాశాలలో జాతీయ గీతాలాపన కార్యక్రమానికి మంత్రి కొప్పుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ%ా%. ఈ మువ్వన్నల జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. గాంధీజీ చూపిన అహింసా మార్గంలో నడిచిన ఆ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితోనే కేసీఆర్ ఉద్యమాన్ని ఉరుకలెత్తించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చారని వివరించారు. అదే దృఢ సంకల్పంతో అన్ని రంగాలలో గొప్పగా ముందుకు తీసుకుపోతున్నారని, అనేక అంశాలలో దేశం మొత్తానికి మన రాష్ట్రం దిక్సూచిగా మారిందన్నారు. ఇందుకు మన గురుకులాలు ప్రబల నిదర్శనం అన్నారు. గురుకులాలు సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలు, విజయాలు మనందరికి



గర్వ కారణంగా నిలుస్తున్నాయని మంత్రి కొప్పుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన పాటలు, ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి, ఆకట్టుకున్నాయి.

# ఆనందాన్ని మించిన సంపద లేదు

- **ఆరోగ్యాన్ని కొనగలిగే ధనమేదీ లేదు**
- **డా. కామేశ్వరి-సూర్యప్రకాశ్**

**చింతల్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** అందరిలో మంచి ఉంది. అందరికీ మంచిని పంచాలి. గత 23 యేళ్లుగా ఇదే ఆశయంతో, అందరికీ విద్యా, వైద్యం, ఆరోగ్యం అందించాలని కృషి చేస్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు వందకు పైగా గ్రంథాలయాలు నిర్వహిస్తున్నామని హైదారాబాద్, చింతల్ లోని ఆనందనిలయం నిర్వాహకులు డా.సూర్యప్రకాశ్– కామేశ్వరీలు తెలిపారు. గత 23 సంవత్సరాలుగా స్త్రీల ఆరోగ్య సమస్యలు, సంతాన లేమి లాంటి సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో ఏనోట్ ప్రతిభా కనబరిచిన డా. కామేశ్వరి తో కలిసి డా. సూర్యప్రకాశ్ పెద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యా అందించడానికి కృషి చేస్తున్నాడు. గత రెండు దశాబ్దాలుగా హైదారాబాద్ లోని కొత్తపేటలో నిర్వహిస్తున్న వైద్యశాల, అందరి ఇల్లు తో పాటు అందరికీ ఆనందం పంచడానికి గాను కొత్తగా "మై ఫైర్ ఫెర్రి" అనే కొత్త ఆలోచనతో వివిధ రాష్ట్రాల్లో ఇంటింటికి పూల మొక్కలను, పళ్ల మొక్కలను పంచుతు, ఆనందమైన జీవితాన్ని గడపడానికి మనకు ఎం కావాలో స్పష్టంగా తెలిపే కార్యక్రమాన్ని చేపట్టారు. జీవితంలో విద్య, ఆరోగ్యం తప్ప మారేది ప్రధానం కాదని, అందరూ సంతోషాన్ని డబ్బులో కాకుండా జీవితంలో సంపాదించుకోవాలని కోరుతున్నారు. గత 23 యేళ్లుగా ప్రజలకు ఎలాంటి ప్రచార ఆర్భాతాలు లేకుండా సేవ చేస్తున్న వీరు తమ సంతోషాన్ని పంచుకోవడానికి, స్త్రీల ఆరోగ్య సమస్యలపై డా. కామేశ్వరి రాసిన "మధుమాలతి " పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని, ఆగస్ట్ 13, శనివారం రోజున, దినమంతా, చింతల్ లో ఉన్న వీరి ఆనంద నిలయంలో నిర్వహించారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన ఎంతో మంది ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో ఆందనిలయంలోని వాలంటీర్లు, చుట్టుప్రక్కల ఉన్న జనం అందించిన సహకారంతో కార్యక్రమమేన్తో ఘ్నంగా జరిగింది.






# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

### కలెక్టర్ ను కోరిన భవన నిర్మాణ కార్మిక సంఘం

జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు): భవన నిర్మాణ కార్మిక రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగులో ఉన్న క్లైమ్ లను వెంటనే పరిష్కరించేలా కృషిచేయాలని తెలంగాణ బిల్డింగ్, నిర్మాణ వర్కర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా నాయకులు, ఏ.ఐ.టి.యు.సి. జిల్లా కార్యదర్శి ఎం.డి.ముక్రంలు కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన వినతిపత్రం లో కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సూతారి రాములు, ముక్రం లు మాట్లాడుతూ కార్మికుల భవితవ్యానికి 1996 చట్టాన్ని తొలగించకుండా రక్షించుకోవాలని, 1979 వలస కార్మికుల చట్టం, 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాన్ని, 1998 సెస్ చట్టాలను రక్షించుకోవాలని అన్నారు. కార్మికుల పెన్షన్ స్కీం అమలుకు కేంద్రం నిధులు బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, తెలంగాణాలోని కొత్త జిల్లాలలో డిసిఎల్, ఏ.ఎల్.ఓ. లను వెంటనే నియమించాలని కోరారు. 55 ఏండ్లు దాటిన కార్మికునికి 5 వేల పెన్షన్ ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పతకాలను అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు డబుల్ బెడ్రూమ్




ఇండ్లలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. వారివెంట ఏ.ఐ. టి.యు.సి. జిల్లా నాయకులు ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కిరణ్, ఎన్నాం రాధ తో పాటు పలువురు ఉన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలు

### సామూహిక జాతీయ గీతాలాపన సక్సెస్

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాల వేడుకలలో భాగంగా రాంగోపాల్ పేట డివిజన్ పరిధిలోని హైదర్ బస్తీ సత్యనారాయణ పురం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ కార్పొరేటర్, టీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలనీ వాసులు సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. అత్తిలి అరుణ గౌడ్ ఈసందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండ వినయ్, వైస్ ప్రెసిడెంట్ శ్యామల



శ్రీనివాస్, ప్రతినిధులు జీఆర్. శ్రీనివాస్, సంకీర్త్, చందు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా కొత్త బస్టాండ్ చౌరస్తాలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, లైబ్రరీ ఛైర్మెన్ డా. చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ ఛైర్ పర్సన్ భోగ శ్రావణి లతో కలిసి జాతీయ గీతాలాపన చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, మైనార్టీ పార్టీ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు



# జాతీయ గీతాన్ని ఆలపించిన మాజి డిప్యూటీ సీఎం

**రఘునాథపల్లి అగస్టు 16 (ప్రజామంటలు):** జాతీయ సమైక్యతను చేటెందుకు సామూహిక దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ గీతాన్ని మాజీ డిప్యూటీ సీఎం




డాక్టర్ తాటికొండ రాజయ్య ఆలపించారు. మంగళవారం హైదరాబాద్ జాతీయ రహదారి పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు యువకులు ప్రభుత్వ అధికారులు పోలీసులు తదితరులు పాల్గొన్నారు వందేమాతరం జై స్వతంత్ర భారత్ కి మా జై అంటూ నినాదాలు చేశారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్ ఎంపీడీవో అసిన్, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, రాజేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులుపోకల శివకుమార్ గుప్తా, తెరాసా మండల అధ్యక్షులు వారాల రమేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బందికి దుస్తుల పంపిణీ

**తరిగొప్పుల ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** నిరంతరం పరిశుభ్రతకు పాటుపడే



గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామ సర్పంచ్ దామెర ప్రభుదాస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరావు, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కారోబార్ లు సిద్ధిరాములు, రాజ కొమురయ్య, గ్రామ వార్డు మెంబర్లు, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**రఘునాథపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించడంతో పాటు పే స్కేల్




వేతనంతో పాటు 55 సంవత్సరాల నిండిన వీఆర్ఏల పిల్లలకు ఉద్యోగం ఇస్తామని ఆరేళ్లు కలిసిన కూడా ఇప్పటివరకు హామీ నెరవేర్చలేదని చేశారు. బస్టాండ్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ మండలాధ్యక్షులు వంశీకృష్ణ, యాదగిరి, సూర్య ప్రకాష్, మంజుల, యాదలక్ష్మి, రాధిక, అంజలి, నరసయ్య, సోమయ్య, అంజయ్య, నగేష్, వసంత్ రాజు, యాదగిరి, శీను, గట్టయ్య, కుమార్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో చెవ్వ యాదమ్మ అనారోగ్యంతో మరణించారు. వారి అంత్యక్రియలకు శాగ ధనప్రకాష్ సుజనా ఫౌండేషన్ తరుపున కర్ర సహాయం చేసిన పౌండేషన్ చైర్మన్ శాగ దేవరాజు. ఇది ఫౌండేషన్ తరుపున 69వ సహాయంగా తెలిపారు.



కరీంనగర్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ బోయిన్ పల్లి వినోద్ కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు మరియు పాలకవర్గ సభ్యులు.

# హై కోర్టు జడ్జి ప్రమాణ స్వీకారం

### ప్రమాణ స్వీకారం చేసిన జగిత్యాలకు చెందిన పుల్ల కార్తీక్

**జగిత్యాల ఆగష్టు 16 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రం విజయపురి కి చెందిన పుల్ల కార్తీక్ హై కోర్టు జడ్జి గా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ హైకోర్టుకు మరో ఆరుగురు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వీరి నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ఆమోదించారు. వీరిలో నలుగురిని జడ్జీలుగా, ఇద్దరిని అదనపు జడ్జీలుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి రాజేందర్ కశ్యప్ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ సందర్భంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రం విజయపురి కి చెందిన పుల్ల కార్తీక్ తో హై కోర్టు జడ్జి గా ప్రమాణ స్వీకారం చేయించారు. హై కోర్టు జడ్జి గా పుల్ల కార్తీక్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల జగిత్యాల కు చెందిన పలువురు న్యాయవాదులతో పాటు దయాల మల్లారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పుల్లా కార్తీక్ 1967 జూన్ 4వ తేదీన జగిత్యాలలో ఒగ్గు హన్మంతు మరియు పోచమల్లమ్మ దంపతులకు జన్మించాడు. ప్రభుత్వ యూ.పి.ఎస్ కొత్తవాడ, జగిత్యాలలో పాఠశాల విద్యను అభ్యసించాడు. మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూ హై స్కూల్, ఎస్.కె.ఎన్.ఆర్ జూనియర్ కళాశాల, జగిత్యాల మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ మరియు ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం , హైదరాబాద్ మరియు ఎల్ ఎల్ .బి నుండి పొలిటికల్ సైన్స్ లో ఎం.ఏ. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా , ఉస్మానియా యూనివర్సిటీ మరియు ఎల్.ఎల్.ఎం నుండి పి.జి నుండి కాలేజ్ ఆఫ్ ఉస్మా నియా యూనివర్సిటీ అతను 27.03.1996 న న్యాయ వాదిగా నమోదు చేసుకున్నాడు. అతను అప్పటి ఏ.పి. హై కోర్టులో అన్ని శాఖలలో ప్రాక్టీస్ చేశాడు మరియు ఉమ్మడి హై కోర్టు విభజన తర్వాత తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీస్ కొనసాగిం చాడు. 2015 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఎ.పి. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ లో ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితు లయ్యారు మరియు 2017 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు మరియు ఇప్పటి వరకు కొనసాగుతున్నారు.



# కొరివి కృష్ణస్వామి సేవాసమితి ఇంచార్జిగా 'గవ్వల నవనీత'

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** హైదరాబాద్ తొలి మేయర్, పత్రికా సంపాదకులు కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి కార్వాన్ నియోజకవర్గం లోని గుడిమల్కాపూర్ డివిజన్ ఇంచార్జి సీనియర్ నాయకురాలు గవ్వల నవనీత ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వెస్ట్ మారేడ్ పల్లిలో రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నగేష్ ముదిరాజ్ చేతుల మీదుగా గవ్వల నవనిత ముదిరాజ్ కి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవ్వల నవనిత ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి కార్వాన్ నియోజకవర్గం రెడ్డి మల్కాపూర్ ఇన్చార్జిగా తనని నియమించడం చాలా సంతోషంగా ఉందని సహకరించిన ముదిరాజ్ కుల బాంధవులకు కృతజ్ఞతలని నవనిత ముదిరాజ్ తెలిపారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అత్యధిక శాతం ఉన్న ముదిరాజ్ కులస్తులు హక్కుల సాధనకు శ్రమిస్తానని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు, అందుకు 19న సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ ప్రధాన చౌరస్తా వద్ద కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉదయం 11 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి కుల, మతాలకు అతీతంగా అందరిని ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు.



# గాంధీ టీజీజీడీఏ ఆఫీస్‌లో జనగణమన

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం గాంధీ ఆసుపత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ (టీజీజీడీఏ) సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. ఈమేరకు గాంధీ ఆసుపత్రిలోని టీజీజీడీఏ కార్యాలయంలో గాంధీ యూనిట్ ప్రతినిధులు, వైద్యులు జనగణమన ఆలపించారు. స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల గురించి టీజీజీడీఏ ప్రెసిడెంట్ డా. ఎస్. రాజేశ్వర్ రావు తన ప్రసంగంలో కొనియాడారు. మహాత్ములు చూపిన బాటలో ప్రతి భారతీయుడు నడవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాంధీ టీజీజీడీఏ యూనిట్ ప్రెసిడెంట్ డా. ఎస్. రాజేశ్వర్ రావు, వైస్ ప్రెసిడెంట్ డా. బన్సీలాల్, ట్రెజరర్ డా. రవి, డా. రమేశ్, పీజీ వైద్యులు సన, మంజుల, సారిక, విఘ్నేశ్వరీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.




ఎడ్ల రవికుమార్ సుమలత కుమారుడు విగ్నేష్ పుట్టినరోజు సందర్భంగా జనగామ జిల్లాలోని వర్ధన్ అనాధాశ్రమం పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి అన్నదానం. పాల్గొన్న వ్యవస్థాపకుడు జోగు భాస్కర్ , కర్రెశేఖర్, నామాల సిద్దు గౌడ్ సాయిరాం, నరేంద్ర, రంజిత్, శంకర్ గుజ్జుల రోహిత్, నలిన్, శివ, నాని, జయ నరేష్, మను.



# బైపాస్ రోడ్ లోని గుంతల రోడ్లను పరిశీలించిన ముదుగంటి

**జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** పట్టణంలోని ఇటీవల భారీ వర్షాలతో బైపాస్ రోడ్ లోని భారీ గుంతలతో ప్రజలకు వాహనదారులకు ఇబ్బంది కరమైన ఏర్పడడంతో ఈ విషయం తెలుసుకున్న ముదిగంటి రవీందర్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.... జగిత్యాల పట్టణంలో మిషన్ భగీరథ పనులతో రోడ్లన్నీ గుంతలు పడ్డాయని అని అలాగే బైపాస్ రోడ్ లోని భారీ వాహనాలు ప్రతిరోజు పోవడంతో భారీ గుంతలు పడడం తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం గాని వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన కోరారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ఆయన వెంట బిజెపి సీనియర్ నాయకులు ఎసియస్ రాజు మున్సిపల్ కౌన్సిలర్ గుర్రం రాము, బిజెపి నాయకులు జ్ఞానేశ్వర్, బాసెట్టి ప్రభాకర్, మల్లేశం, పులి శ్రీధర్, అరుణ్ తదితరులు ఉన్నారు.



# రుణమాఫీ చెక్కుల పంపిణీ చేసిన ప్యాక్స్ చైర్మన్ రాజా సుమన్ రావు

**గొల్లపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** గొల్లపెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గొల్లపెల్లి సభ్యులకు 2014 – 2015 ఆర్థిక సంవత్సరం ముందు 24 మంది రైతులకు 4.16 లక్షల రుణమాఫీ చెక్కులను అందజేసిన గొల్లపెల్లి ప్యాక్స్ చైర్మన్ %డ% జగిత్యాల జిల్లా ప్యాక్స్ ఫోరంలా అధ్యక్షులు డా. సుంకిసాని రాజా సుమన్ రావు మరియు డైరెక్టర్లు. తమకు ఈ చెక్కులు అందజేసినందుకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తు డా. సుంకిసాని రాజా సుమన్ రావుకి కృతజ్ఞతలు తెలిపారు.



## స్వాతంత్ర వజ్రోత్సవాల సామూహిక జాతీయ గీతాలాపన

**ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** జాతీయ స్వాతంత్ర వజ్రోత్సవాల్లో





బాగంగా సామూహిక జాతీయ గీతం ఆలాపన చేసిన తహసీల్దార్, ఎస్ఐ ఉమాసాగర్, ఎంపీపీ జాజాల భీమేశ్వరి జగన్ రావు, సర్పంచ్ వేమూరి లతా సత్యనారాయణ, దొంతుల శ్యామల తుకారం, ఎంపీటీసీ పొనుకంటి చిన్న వెంకటి, రాములు, కార్యదర్శి రాకేష్, దోమకొండ చిన్న రాజన్న, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్, మహిళా సంఘాలు, నాయకులు

## ములుకనూర్ లో సామూహిక జాతీయ గీతాలాపన

**భీమదేవరపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉ. 11.30 ని.లకు ములుకనూర్ అంబేద్కర్ చౌరస్తాలో





జాతీయ గీతాలాపన నిర్వహించారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ గీతాన్ని ఆలపించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కుల, మత, వర్గ విభేదాలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై గౌరవంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్, జెడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీ బొల్లంపల్లి రమేష్, ఎంపిడిఓ లంకపల్లి భాస్కర్, ఎంపీఓ నాగరాజు, శరీఫోద్దీన్, మర్పాటి మహేందర్ రెడ్డి, మండల సురేందర్, ఉమా మహేశ్వర్, శ్రీకాంత్, మొగిలి, సదానందం, రాజు, కర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పౌష్టికాహారం పంపిణీ

### ఎంపిపి జాజాల భీమేశ్వరి

**ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** మండల కార్యాలయంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఆధ్వర్యంలో దివ్యాంగుల కిషోర బాలికలకు పౌష్టికాహారం



పంపిణీ చేయడం జరిగింది. పౌష్టికాహారం లో భాగంగా 10 కిలోల గోధుమలు, 1కిలో లయన్ డేట్స్, కాల్షియం టాబ్లెట్స్, ఐరన్ సిరప్,1/2 కిలో నెయ్యి ప్రోటీన్ బిస్కెట్స్ 3 బాక్సులు, 6 వస్తువులతో కూడిన కిట్లను 11–14 సంవత్సరాలు గల బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ నేమురి లత, ఉప సర్పంచ్ గూడ రామ్ రెడ్డి, ఎంపిటిసి తిమ్మని రాములు, మండల కో ఆప్షన్ ఏలేటి చిన్న రెడ్డి, సిడిపిఓ తిరుమల దేవి, సూపర్ వైజర్ లు సువర్ణ, షైనీ, అంగన్వాడీ వర్కర్లు భాగ్యలక్ష్మి, మంజుల, నాయకులు జాజాల జగన్ రావు, నేమురి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నార

## ఉత్తమ పురస్కారం అందుకున్న అధికారులకు సన్మానం

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 16 (ప్రజామంటలు):** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాజల భీమేశ్వరి ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారం జిల్లా కేంద్రంలో



జరిగిన 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో, మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అందుకున్న మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఉదయ్ కుమార్, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న కానిస్టేబుల్ బి. రాజేందర్. ముగ్గురు అధికారులని శాలువాతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరెన్నో ఉత్తమ పురస్కారలు పొందాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల కో ఆప్షన్ ఏలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మని రాములు, సర్పంచ్ నేమురి లత , ఉపసర్పంచ్ గూడ రాంరెడ్డి, నాయకులు జగన్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణ 16వ వార్డుకు చెందిన ఎన్. విజయకు సీఎం సహాయ నిది ద్వారా మంజూరైన ఒక లక్ష రూపాయల విలువగల చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఇంటికి స్వయంగా వెళ్లి అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, లైబ్రరీ ఛైర్మెన్ డా. చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్, కౌన్సిలర్ కూతురు రాజేష్

## రెడ్డి కాలనీ పాల జెండా వద్ద సామూహిక జాతీయ గీతాలాపన

**హన్మకొండ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో



భాగంగా మంగళవారం ఉ. 11.30 ని.లకు జాతీయ పతకం ఆవిష్కరణ అనంతరం సామూహిక జాతీయ గీతాలాపన లో రెడ్డి కాలనీ పాల జెండావద్ద 8 వ డివిజన్ జిడబ్ల్యుఎమ్సి కార్పొరేటర్ భైరి లక్ష్మీ కుమారి, భైరి శ్రావణ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది భీమయ్య, రాము, శ్యాం, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక గీతాలాపన సక్సెస్

### జెండా ఎగుర వేసిన మాజీ మంత్రి మర్రి

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్




మహొత్సవ్ వేడుకల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ పాట్నీ సెంటర్ లో బనకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి ఈసందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. జనగణమన జాతీయ గీతాన్ని స్థానికులు సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో బనకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి, సెక్రటరీ సంజీవ రెడ్డి, రవి, నయీం, ఖాన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో మృతి చెందిన మేక

**గొల్లపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం తిరుమలపురం(



పీడి) రెవెన్యూ శివార్లో గుంజపడుగు గ్రామానికి చెందిన తమ్మనవేని కుమార్ కు చెందిన మేక ప్రమాదవశాస్తూ విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద విద్యుత్ ఘాతంతో మంగళవారం మృతి చెందింది మేకల కాపరైన కుమార్తెను మూగజీవాలను మేతకు తీసుకపోగా విద్యుత్ ట్రాన్స్ఫర్ సమీపంలో మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురి అక్కడే మృతి చెందింది దీంతో తనకు సుమారు 15వేల నష్టం వాటినట్టు బాధితులు ఆవేదన వ్యక్తుడు విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతోనే మేక మృతి చెందినట్లు గ్రామ ఉపసర్పంచ్ ఖర్చులు హరి కిరణ్ రెడ్డి ఆరోపించారు. విద్యుత్ ట్రాన్స్ఫారం ప్రమాదబరితంగా ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోపోవడం వలనే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని పేర్కొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

**భీమదేవరపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట రక్షణ కోసం మంగళ వారం వంగర పోలీసులను ఆశ్రయించింది. మండల పరిధిలోని గాంధీనగర్ కు చెందిన ఏనుగుల అజయ్ కుమార్ (24), హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రతాప రుచిత (21) గత మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించరని భావించిన ప్రేమికులు కేశపట్నం మండలం కొత్తగట్టు మత్సగిరీంద్ర స్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. రక్షణ కోసం మంగళవారం ఎల్కతుర్తి సీఐ ఎస్. శ్రీనివాస్ ను ఆశ్రయించారు.



కథలాపూర్ లో జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ఎమ్మార్వో రవీందర్, ఎంపీడీఓ నవీన్, ఎంపిఓ ప్రవీణ్, ఎం.ఈ.ఓ ఆనంద రావు, విద్యార్థులు, స్థానిక ప్రజలు

## రోడ్డెక్కిన వీఆర్ఏల సమ్మె

**ఎల్కతుర్తి ఆగస్టు 16 (ప్రజామంటలు):** మండలం లోని నేటికి ఇరవై



మూడు రోజులు గడిచినా ప్రభుత్వ వైఖరిని కి నిరసనగా ఎల్కతుర్తి హైవే రోడ్డు పై వీఆర్ఏలు గంటపాటు ధర్నా చేయడం అయినది ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన పే స్కేల్ పద్ధతిని అమలు చేయాలని చేయని పక్షంలో అన్ని పార్టీలతో మద్దతు కూడగట్టుకొని పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని నిరసన వ్యక్తం తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని 13 వార్డ్ కు చెందిన బి. సోమేశ్వర్ కు 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్



చెక్ ను వార్డ్ కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ రాజు అందజేశారు. ఈ సందర్భంగా తెరాస నాయకులు మల్లిగారి రాజు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఏ అవసరాలకు అయినా ప్రభుత్వం తగిన సాయం చేస్తూ ముందుకు సాగుతున్న తరుణంలో జనగామ పట్టణానికి చెందిన వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరిగిందని, సహకరించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు ఉడుగుల కృష్ణయ్య, సురుగు సుధాకర్ ,తెరాస యూత్ టౌన్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్ పాల్గొన్నారు.

## ఐఐఆర్ఎం విద్యా సంస్థ సామూహిక జాతీయ గీతాలాపన

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వతంత్ర భారత వజ్రోత్సవాలు లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు



మంగళవారం ఐఐఆర్ఎం విద్యార్థులు, అద్యాపకులు, సిబ్బంది, సభ్యులు జనగణమన పాడారు. ఈమేరకు వారు( ఐఆర్డీఏఐ ఆండ్ తెలంగాణ జాయింట్ ఇనిషియేటివ్ ) విప్రో సర్కిల్, గచ్చిబౌలి ప్రాంతంలో సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. అనంతరం దేశభక్తి నినాదాలు చేశారు.

## ప్యాట్నీ సిగ్నల్ వద్ద జనగణమన

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు



మంగళవారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్యాట్నీ సిగ్నల్ వద్ద సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ తెరాస ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, కిరణ్మయి, మహంకాళి ఏసీపీ రమేష్, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, డీసీ ముకుంద రెడ్డి, ఏఎంఓహెచ్ ప్రవీణ్, విద్యార్థులు, పోలీసు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం క్షేత్రాలలో అధికంగా రసాయన ఎరువులు

### పట్టించుకోని అధికార యంత్రాంగం

**తరిగొప్పుల ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** దుక్కి దున్నిన రైతన్న కు తన వ్యవసాయ క్షేత్రంలో క్రిమి కీటకాలు సంతరించుకున్నాయని తెలుసుకుని సర్కైన అవగాహన లేక అధికారుల సలహాలు సూచనలు తీసుకోకుండా రైతు సరాసరి షాపు వారిని సంప్రదించి ఏదో ఒక మందుతో పాటుగా దానికి తెగులు మరియు మ్మొక్క బలంగా వుండడానికి అనీ ఇలా అధిక మెతదులొ ఎరువులు వాడటం తో భూమి మీద వున్న మ్మొక్క లకు కవలిసిన పోషకాలు సర్కైన విధంగా అందక భూమి లోని బలాన్నిచ్చే పోషకాలను మనమే చంపు కుంటున్నారు. అధికంగా ఎరువులు వాడకం చేయడంతో ప్రజలు తినే ఆహారం పోషక రహితంగా వుండడంతో ప్రజలకు అధిక వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఉన్న వ్యవసాయ నిర్వహణ అధికారులు ఉన్నరంటే ఉన్నారు కాని వారి కార్యలయం లోనే...! తప్ప బయటికి వచ్చి రైతులకు ఎలాంటి ఎరువులు వాడుతున్నారు? నాసిరకం ఎరువులా... లేదా ఆ పొలము కు వాడకం చేయవచ్చునా?!..లేదా?



అని పట్టించుకోవడం లేదు. మరియు మండలానికి వ్యవసాయ అధికారి ఎవరు లేరు.

# సుధాదేవి నాయుడు కు జాతీయ మహిళా స్ఫూర్తి పురస్కారం

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** ఏపీ 24 న్యూస్ ఛానల్ నిర్వహించిన జాతీయ స్వాతంత్ర్య సేవారత్న పురస్కారానికి మిసెస్ ఇండియా తెలంగాణ – 2022 సుధాదేవి నాయుడు ఎంపికయ్యారు. ఈమేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ 24 న్యూస్ ఛానల్ నిర్వాహకులు సుధాదేవినాయుడు కు జాతీయ మహిళా స్ఫూర్తి సేవారత్న అవార్డును అందచేశారు. గత కొన్నేండ్లుగా సామాజిక సేవలో రాణిస్తున్న సుధాదేవి నాయుడు కు జాతీయ మహిళా స్ఫూర్తి సేవారత్న అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు యువత వికాసానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. తనకు జాతీయ అవార్డును ప్రధానం చేసిన నిర్వాహకులకు సుధాదేవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిల్మ్ డైరెక్టర్ సముద్ర, సినీ ఆర్టిస్టులు నరేశ్ రాజ్, లక్కీ, లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా సెక్రటరీ బుచ్చేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి కార్యకర్తలపై రాళ్ల దాడికి నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

**మెట్టుపల్లి ఆగస్టు 16 (ప్రజామంటలు):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయన్న తలపెట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో నిన్న టీఆర్ఎస్ కార్యకర్తలు,బిజెపి కార్యకర్తల మీద రాళ్లతో దాడి చేయడం జరిగింది. దీంట్లో బీజేపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు అయినాయి, దీనికి నిరసనగా మెట్పల్లి డిపో వద్ద బిజెపి పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ యొక్క దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబారు ప్రభాకర్, బీజేపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ జె. యన్. వెంకట్, బిజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధొనికల నవీన్, మద్దెల లావణ్య, నేను సౌజన్య, బొడ్ల నరేష్, సింకేటి విజయ్, రమేష్ యాదవ్, ఆర్మూర్ రంజిత్, కలికోట శ్రీకాంత్, కుడుకల రఘు, కొల్లెం శ్రీనివాస్, సదాశివం, సత్యనారాయణ, బండారి రమేష్, లింగేశ్వర్ కుమార్, ఎద్దులాపురం బోడ్ల గౌతం, ఆనందు, పాంపర్టీ ఆనంద్, దేవరాజం , మిట్టపల్లి శివ, విజయ్, బీమనాథ్, తోకల గంగా నరసయ్య, అనిల్ గౌడ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గాంధీలో సామూహిక జనగణమన

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం గాంధీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి ఆవరణలోని మైదానంలో సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా దేశభక్తి నినాదాలు చేశారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ డా.రాజారావు, డిప్యూటి సూపరింటెండెంట్ డా. శోభన్ బాబు, టీజీజీడీఏ ప్రెసిడెంట్ డా.ఎస్. రాజేశ్వర్ రావు, డా. నరేందర్, డా. నాగమణి, డా. జయకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, ఆయా విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



## టాలీవుడ్‌కు పార్ట్ 2ల ఫీవర్!



స్టార్ డైరెక్టర్ రాజమౌళి ఏ ముహూర్తాన పార్ట్ 1. పార్ట్ 2 సంస్కృతికి శ్రీకారం చుట్టాడో కానీ ఇప్పుడు ఎవరిని కదిలించినా ఇదే ఫార్ములా వినిపిస్తోంది. ప్రభాస్ హీరోగా రాజమౌళి అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించిన పీరియాడిక్ ఫిక్షనల్ మూవీ 'బాహుబలి'. ఈ భారీ మూవీని పార్ట్ 1 పార్ట్ 2 గా తెరకెక్కించిన రాజమౌళి దేశ వ్యాప్తంగా చరిత్ర సృష్టించడమే కాకుండా ఈ తరహా చిత్రాలకు బీజం వేశారు. భారీ స్థాయిలో తెరకెక్కిన బాహుబలి బాహుబలి 2 సంచలన విజయాన్ని సాధించడంతో ఇప్పుడు ప్రతీ ఒక్కరూ ఇదే ఫార్ములాని అనుసరిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ ఇదే తరహా సినిమాలని సెట్స్ పైకి తీసుకొస్తున్నారు. 'బాహుబలి' అందించిన ధైర్యంతో కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి 'కేజీఎఫ్' తెరకెక్కిన విషయం తెలిసిందే. చాప్టర్ 1 సంచలన విజయాన్ని సొంతం చేసుకోవడంతో దీనికి సీక్వెల్ గా రీసెంట్ గా చాప్టర్ 2ని తెరపైకి తీసుకొచ్చారు. యష్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ మూవీ దేశ వ్యాప్తంగా సీక్వెల్ సినిమాలకు భారీ ఊతమిచ్చింది. బాక్సాఫీస్ వద్ద రూ. 1250 కోట్లకు మించి వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలనే విస్మయానికి గురిచేసింది. త్వరలో దీనికి కొనసాగింపుగా చాప్టర్ 3 ని తెరపైకి తీసుకురానున్న విషయం తెలిసిందే. ఇదే పంథాలో పుష్పకు సీక్వెల్ రాబోతోంది. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ డైరెక్షన్ లో అత్యంత భారీ బడ్జెట్ తో ఈ మూవీకి పార్ట్ 2 రాబోతోంది. ఇక సెట్స్ పై వున్న ప్రభాస్ మూవీ 'సలార్' కూడా రెండు భాగాలుగా రాబోతోందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ ఇంత వరకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఆగస్టు 5న విడుదలైన నందమూరి కల్యాణ్ రామ్ మూవీ 'బింబిసార' బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవడంతో దీనికి కొనసాగింపుగా పార్ట్ 2ని చేయబోతున్నామంటూ ప్రకటించారు. ఇదే కోవలో మరిన్ని సినిమాలు కూడా రెండు పార్ట్ లుగా రానున్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా వుంటే తాజాగా 'ప్రాజెక్ట్ కె'ని కూడా 'బాహుబలి' కేజీఎఫ్. పుష్ప బింబిసార సలార్ చిత్రాల తరహాలో రెండు భాగాలు గా తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. 'ప్రాజెక్ట్ కె' కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. దాదాపు రూ. 500 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ మూవీని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ తో సాగే సైన్స్ ఫిక్షన్ గా తెరకెక్కిస్తున్నారు. హిమాలయాల్లోని ఓ గుహలోకి వెళ్లిన బృందం మరో కాలానికి వెళ్లడం అనే సరికొత్త కథగా ఈ మూవీని రూపొందిస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. భారీ స్పాన్ వున్న కథ కావడంతో దర్శకుడు రెండు భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నాడట. 'బాహుబలి' కేజీఎఫ్. పుష్ప బింబిసార చిత్రాల్లోని పతాక ఘట్టాల్లో పార్ట్ 2కు లీడ్ ఇచ్చినట్టుగా 'ప్రాజెక్ట్ కె' క్లైమాక్స్ లో పార్ట్ 2 కి లీడ్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది.

## నాలుగేళ్ల తర్వాత అలా శ్రావణ భార్గవి!



టాలీవుడ్‌లో సింగర్‌గా మంచి పేరు తెచ్చుకుంది శ్రావణ భార్గవి. సంగీతంపై ఉన్న ఆసక్తితో సింగర్‌గా సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. 'సింహమంటి చిన్నోడో' అంటూ వెండితెరపై తన వాయిస్‌తో మ్యాజిక్ చేసింది. దివంగత మ్యూజిక్ డైరెక్టర్ చక్రి, మణిశర్మ, కీరవాణి, తమన్, దేవి శ్రీ ప్రసాద్, మిక్కీ జె మేయర్ వంటి తదితర ప్రముఖ దర్శకులతో కలిసి పాడింది. అలాగే స్టార్ హీరోలతోపాటు యువ కథానాయకుల సినిమాల్లో గాత్రం అందించింది. బుల్లితెర వేదికగా పలు సంగీతం కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రావణ భార్గవి డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా అలరించింది. గబ్బర్ సింగ్, ఈగ, రామయ్యా వస్తావయ్యా సినిమాల్లో హీరోయిన్లకు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. అయితే గత కొంతకాలంగా సినిమాలకు దూరం ఉంటూ యూట్యూబ్ ?ఛానెల్‌లో భిన్నమైన వ్లోగ్స్ చేస్తూ నెటిజన్లు ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ఇటీవల ఓ వివాదంలో చిక్కుకుంది కూడా. అయితే చాలా కాలం తర్వాత మళ్లీ తన గాత్రాన్ని వినిపించనుంది శ్రావణ భార్గవి.

# మాజీ ప్రధాని వాజ్పేయి వర్ధంతి

### గాంధీ లో పేషంట్లకు పండ్ల పంపిణీ చేసిన కేంద్ర మంత్రి

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** దివంగత మాజీ ప్రధాని



అటల్ బీహారీ వాజ్పేయి వర్ధంతిని పురస్కరించుకొని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మంగళవారం గాంధీ ఆసుపత్రిలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ డా.రాజారావును కలిసి ఆసుపత్రిలో పేషంట్ల రద్దీ, సౌకర్యాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, సిటీ మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బీజేపీ నాయకులు సారంగపాణి, టి. రాజశేఖర్ రెడ్డి, కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీలో జనగణమన

**సికింద్రాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** స్వాతంత్రం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న



వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా మంగళవారం ఉస్మానియా మెడికల్ కాలేజీలో సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి తో పాటు మెడికల్ కాలేజీ వైద్య సిబ్బంది, ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

## గొల్లపల్లి లో సామూహిక జాతీయ గీతాలాపన

**గొల్లపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో, మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పిలుపు



మేరకు ఉ 11:30 నిమిషాలకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రధాన కూడల వద్ద సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే మండల కేంద్రంలో నిత్య జనగణమన కార్యక్రమాన్ని మండల ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఇందుకు సహకరించిన వ్యాపార, వాణిజ్య వర్గాలకు అభినందనలు తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బస్టాండ్ కూడలిలో సామూహిక జాతీయ గీతాలాపన

### పోలీస్ ఆధ్వర్యంలో సక్సెస్

**ఎల్కతుర్తి ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి లో జాతీయ గీతాలాపన గురించి నిర్వహించిన సిఐ శ్రీనివాస్ ఎస్ఐ పరమేశ్ ల ఆధ్వర్యంలో దాదాపు 25 వేల మందితో జాతీయ గీతాన్ని పాడించిన పోలీస్ బృందానికి ఎల్కతుర్తి గ్రామ ప్రజలందరూ కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంలో బస్టాండు రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే



నిలిచిపోయాయి. ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేస్తూ జాతీయ గీతాన్ని ఆలపించారు. ఇందులో ఎంపీపీ మేకల స్వప్న స్థానిక సర్పంచ్ కొమ్మిడి నిరంజన్ రెడ్డి, ఎమ్పిటిసి పురం అధ్యక్షుడు కడారి రాజు వెల్దుర్తి స్వామి, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీఓ పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, టిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ గొడిశాల సమ్మయ్య, ఎల్కతుర్తి గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లూట్ కళాకారుడు కడింగుల రమేష్‌కు సన్మానం

**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు):** నాయి బ్రాహ్మణసంఘం జిల్లా కార్యాలయంలో 75వ స్వతంత్ర వజ్రోత్సవాలు పురస్కరించుకుని జిల్లా అధ్యక్షుడు జిల్లెల్లగణేష్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని స్దానిక మంగళ వాస్తవ్యులు ఫ్లూట్ కళాకారుడు కడింగుల రమేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అభినాష్, నాయకులు శ్రీరాములు, జంపాల, శ్రీనివాస్, శంకర్, కడింగుల రాంచందర్, భాస్కర్ సంజీవ, లింగం, గణపతి సంతోష్ క్రిష్ణ ఉపేందర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com